## ప్రమాదాలు జరిగే చోట వేగం తగ్గించాలి




**నగరం, మార్చి 27, ప్రభాతవార్త:** బాపట్ల రేపల్లె నేషనల్ హైవే పై జరుగుతున్న ప్రమాదాలకు ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని నగరం ఎస్సై బండ్ల భార్గవ్ అన్నారు. నగరం మండలం పెద్దవరం గ్రామపంచాయతీ శబంగులపాలెంలో నేషనల్ హైవేపై రోడ్డు భద్రత దృష్ట్యా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నయని బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, బాపట్ల జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు కనగాల ఎంట్రీ పాయింట్ వద్ద , సర్వీస్ రోడ్ల యందు నేషనల్ హైవే పై ఇరువైపులా 10 ప్రమాద హెచ్చరిక బోర్డులు, స్పీడ్ లిమిట్స్ బోర్డులు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరు ప్రమాదాలు జరగకుండా హెల్మెట్ ధరించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ ప్రమాద హెచ్చరికలను గమనించాలని తెలియజేశారు.

# బాపట్ల జిల్లా వార్త



## 29న తెదేపా ఆవిర్భావ దినోత్సవం



**భట్టిప్రోలు(రేపల్లె), మార్చి 27, ప్రభాతవార్త:** భట్టి ప్రోలు వ్యవసాయ మార్కెట్ యార్డు నందమూరి తారకరామారావు విగ్రహం వద్ద ఆదివారం తెదేపా 44వ ఆవిర్భావ దినోత్సవం జరుగుతుందని తెదేపా రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా శుక్రవారం తెలిపారు. పార్టీ పతాకావిష్కరణ, ప్రముఖుల ప్రసంగాలు తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమానికి మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని సాయిబాబా పిలుపునిచ్చారు.

## యువత క్రికెట్ బెట్టింగ్ ఊబిలో పడొద్దు..!

### -ఆశ చూపి అధఃపాతాళానికి నెట్టేస్తుంది,బెట్టింగ్ అనేది పెనుభూతం : జిల్లా ఎస్పీ



**బాపట్ల, మార్చి27, ప్రభాతవార్త:** బెట్టింగ్ అనేది ఒక పెనుభూతం.. అది ఆశ చూపి అధఃపాతాళానికి నెట్టేస్తుంది. సులభంగా డబ్బు సంపాదించవచ్చనే భ్రమలో పడి యువత తమ బంగారు భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దు" అని బాపట్ల జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ హెచ్చరించారు. శనివారం (మార్చి 28) నుంచి ఐపీఎల్ క్రికెట్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో, జిల్లాలో బెట్టింగ్‌ల నివారణపై శుక్రవారం ఆయన పలు సూచనలు చేశారు. క్రికెట్ మ్యాచ్‌లను కేవలం వినోదం కోసం మాత్రమే చూడాలని, జూదంగా మార్చుకోవద్దన్నారు. మార్చి 28 నుంచి దేశవ్యాప్తంగా ఐపీఎల్ హంగామా మొదలవుతోంది. దీన్ని అదునుగా తీసుకుని కొందరు స్వార్థపరులు యువతను బెట్టింగ్ వైపు మళ్లించే అవకాశం ఉందన్నారు. ఒక్కసారి ఈ ఊబిలో చిక్కుకుంటే బయటకు రావడం కష్టం. ఒకసారి లాభం వచ్చినా, పదిసార్లు నష్టం రావడం ఖాయమన్నారు. ఆ నష్టాలను పూడ్చుకోవడానికి, చేసిన అప్పులు తీర్చడానికి యువత దొంగతనాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. యువత, విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా చదువుపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు నిరంతర నిఘా ఉంచాలని, చిన్న మొత్తంలో బెట్టింగ్ వేసినా ఉపేక్షించకుండా వారిని సన్మార్గంలో పెట్టాలన్నారు.

**నిర్వాహకులపై ఉక్కుపాదం**

జిల్లాలో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడినా, ఇతరులను ప్రోత్సహించినా చట్టపరమైన కఠిన చర్యలు తప్పవన్నారు. అనుమానితులపై ఇప్పటికే ప్రత్యేక నిఘా ఉంచామని అయినా తెలిపారు. మీ పరిసరాల్లో ఎక్కడైనా బెట్టింగ్ జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 112 కి గానీ, స్థానిక పోలీసులకు గానీ సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామన్నారు.

## రేపల్లెలో గోతులు పూడ్చటంలో నిర్లక్ష్యం



రేపల్లె, మార్చి 27, ప్రభాతవార్త:రేపల్లె పట్టణంలో రహదారుల పక్కనే వాటర్ పైపు లైన్లు ఏర్పాటు చేసేందుకు, మురుగునీటి కాల్వల మరమ్మతుల కోసం తవ్విన గోతులు పూడ్చటంలో కొనసాగుతున్న నిర్లక్ష్యం వలన వాహన చోదకులు, పాదచారులు, వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రమాద పరిస్థితులు పొంచి ఉన్నాయి. పనులు పూర్తయినా గోతులను వదిలేయడం విమర్శలకు తావిస్తోంది. రేపల్లె పురపాలక సంఘం కార్యాలయానికి సమీపంలోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయానికి వెళ్ళే రహదారి ప్రారంభంలోనే కాల్వగా తయారైన గోతులు దర్శనమిస్తున్నాయి. పురపాలక సంఘం నెలకొన్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ శాఖ అధికారుల తీరుకు నిదర్శనంగా నిలిచింది. అధికారులు స్పందించి గోతులను పూడ్చించాలని పట్టణంలో చాలా చోట్ల ఇటువంటి పరిస్థితులు ప్రజలు కోరుతున్నారు.

## బాపట్ల జిల్లాలో నూతన న్యాయస్థానాలు ఏర్పాటు చేయాలి



**రేపల్లె, మార్చి 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నూతన న్యాయస్థానాల ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం తెలిపినందున బాపట్ల జిల్లాలో నూతన న్యాయస్థానాలు ఏర్పాటు చేయాలని జైభీమ్ రావ్ భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, న్యాయవాది దోవా రమేష్ రాంజీ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గతంలో నూతన న్యాయస్థానాల ఏర్పాటు అంశాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ దృష్టికి తీసుకువెళ్ళామని చెప్పారు. 2004 సంవత్సరం నుంచి జాప్యం జరిగినప్పటికీ ఎట్టకేలకు రాష్ట్ర మంత్రి మండలి నూతన న్యాయస్థానాల ఏర్పాటుపై ఓ నిర్ణయానికి రావడం అభినందనీయమన్నారు. జిల్లా కేంద్రమైన బాపట్లలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి న్యాయస్థానం, రెవెన్యూ డివిజన్ కేంద్రాలైన చీరాల, రేపల్లెలో అదనపు జిల్లా స్థాయి కోర్టులను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. అదే విధంగా వేమూరు నియోజకవర్గ పరిధిలోని చుండూరు, అమర్తలూరు, వేమూరు, కొల్లూరు మండలాల పరిధికి సంబంధించి వేమూరులో జూనియర్ సివిల్ కోర్టును ఏర్పాటు చేయాలని రమేష్ రాంజీ సూచించారు. జిల్లాలో నూతన న్యాయస్థానాల ఏర్పాటుకు శాసనసభ్యులు కృషి చేయాలని లేదంటే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని ఆయన వెల్లడించారు.

## నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు..!

### బాపట్ల టౌన్ సిఐ రాంబాబు హెచ్చరిక



**బాపట్ల,మార్చి 27, ప్రభాతవార్త:** వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని బాపట్ల టౌన్ సిఐ రాంబాబు సూచించారు. బాపట్ల జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్ వద్ద హెల్మెట్ ధారణపై శుక్రవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ రాంబాబు మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించడం బాధ్యతగా గుర్తించాలని, హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని పేర్కొన్నారు. పట్టణ వ్యాప్తంగా ఈ అవగాహన కార్యక్రమాలు ఏప్రిల్ 10వ తేదీ వరకు కొనసాగుతాయని వెల్లడించారు.

ఏప్రిల్ 11 నుంచి కఠిన నిబంధనలుఅవగాహన గడువు ముగిసిన తర్వాత, ఏప్రిల్ 10వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా కఠిన నిబంధనలు అమలు చేస్తామన్నారు. ముఖ్యంగా "నో హెల్మెట్ నో ఫ్యూయల్" విధానాన్ని పట్టణంలోని అన్ని పెట్రోల్ బంకుల్లో అమలు చేయనున్నట్లు స్పష్టం చేశారు. హెల్మెట్ లేని వాహనదారులకు పెట్రోల్ పోయవద్దని బంకు యజమానులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. వాహనదారులు పోలీసులకు సహకరించి, జరిమానాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సైలు విజయ్ కుమార్, నస్రీన్, పోలీస్ సిబ్బంది మరియు ట్రాఫిక్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీరామనవమి వేడుకలు



**నిజాంపట్నం, మార్చి 27, ప్రభాతవార్త:** శ్రీరామనవమి పర్వదినాన్ని మండల ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో వైభవంగా జరుపుకున్నారు. శుక్రవారం మండల కేంద్రమైన నిజాంపట్నం మెయిన్‌బజార్, యాదవపాలెం, జలా ్సబజార్, ఎజికెపేట, లయన్స్‌కాలనీ, గోకర్ణమఠం, మండలంలోని కూచినపూడి, అడవులదీవి, కొత్తపాలెం, దిండి, కళ్ళిఫలం తదితర గ్రామాలలో చలువ పందిళ్ళు వేసి శ్రీసీతారామస్వామివార్ల ప్రతిమలను ఏర్పాటు చేశారు. స్వామివార్ల ప్రతిమలకు ప్రత్యేక పూజాది కార్యక్రమాలను జరిపించారు. ఈ సందర్భంగా అనేక చోట్ల అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శ్రీరామనవమి ప్రత్యేకతైన చలిమిడి, వడపప్పు, పానకం స్వీకరించారు. తెదెపా, కూటమి నాయకులు శ్రీరామనవమి సందర్భంగా ఏర్పాటు చేసిన స్వామివార్ల ప్రతిమలను దర్శించుకున్నారు. పందిళ్ళను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.

## తెనాలి రవీంద్రనాథ్ కాలనీలో శ్రీరామనవమి వేడుకలు



**తెనాలి టౌన్, మార్చి27,(ప్రభాతవార్త):** తెనాలి పట్టణంలోని రావి రవీంద్రనాథ్ కాలనీ, రెండుగేట్ల మధ్య వేంచేసిన శ్రీసీతారామ స్వామి మందిరం వద్ద శ్రీసీతారాముల కళ్యాణం ఎంతో వైభవంగా నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ నల్లగొర్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గత 20సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఈ వసంత నవరాత్రి ఉత్సవాలు, ఈసారి 21వసంవత్సర వేడుకలను ఎంతో ఘనంగా నిర్వహించారు. చెరుకూరి రమేష్ బాబు పద్మావతి మరియు అన్నవరపు మాణికుమార్ నాగజ్యోతి దంపతులచే శ్రీసీతారాముల కళ్యాణమహోత్సవం చలువ పందిరి సాక్షిగా, వేదమంత్రాల నడుమ, మంగళవాయిద్యాల మధ్య శ్రీసీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని భక్తజనం కన్నులపండుగగా తిలకించారు. మారీసు పేట, రవీంద్రనాథ్ కాలనీ, చంద్రబాబు నాయుడు కాలనీ పరిసర ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున భక్తులు శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవానికి తరలివచ్చి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా, ముఖ్య అతిధిగా విచ్చేసిన త్రీ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్. సాంబశివరావు, శ్రీ సీతారామస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం అన్నదానం కార్యక్రమం ప్రారంభించారు. సుమారు 5వేలమంది భక్త జనానికి అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మాజీ కౌన్సిలర్ నల్లగొర్ల నాగేశ్వరరావు, డాక్టర్ దొండపాటి కోటేశ్వరరావు, తాడిబోయిన మునలయ్య, నన్నపనేని రాంబాబు, మాజీ కౌన్సిలర్లు తాడిబోయిన రామయ్య, కరేటి రవి, ఎన్సిసి శ్రీను, కరేటి వాసు మరియు చెరుకూరి రమేష్ బాబు మిత్రబృందంతో పాటుగా శ్రీ సీతారామస్వామి మందిరం భక్త బృందం పాల్గొన్నారు.

## మండలంలో ఘనంగా శ్రీసీతారామ కళ్యాణ మహోత్సవం

**వేమూరు, మార్చి 27,ప్రభాతవార్త :** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని వేమూరు మండలంలోని గ్రామాలలో రామాలయాల వద్ద



ప్రత్యేక పందిళ్ళు ఏర్పాటు చేసి శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వరహాపురం శ్రీ కోదండ రామస్వామి దేవాలయ కళ్యాణ మంటపంలో జరిగిన కళ్యాణంలో గోగినేని సాయి తేజ, సాయి శ్రీ శరణి దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. అదే విధంగా మండలంలోని పలు గ్రామాల్లో నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అధిక స్యంలో మహిళలు భక్తులు పాల్గొన్నారు.

## వైభవంగా సీతారాముల కళ్యాణం

**భట్టిప్రోలు(రేపల్లె), మార్చి 27, ప్రభాతవార్త:** మండలంలోని భట్టిప్రోలు, అద్దేపల్లి, ఐలవరం, సూరేపల్లి, కోనేటిపురం, పల్లెకోన, పడమటపాలెం, రాచూరు, ఆళ్ళమూడి, పెదపులివర్రు, ఓలేరు, గొరిగపూడి, పెసర్లంక, చింతమోటు, ఎదలంక, వెల్లటూరు, వరికూటివారిపాలెం తదితర గ్రామాలలో శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుకలు వైభవంగా



జరిగాయి. అర్చకులు శాస్త్రోక్తంగా పూజా కార యక్రమాలు నిర్వహించారు . చలువ పందిళ్ళలో సీతారామ కళ్యాణ మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో జరిపారు. భట్టి ప్రోలులోని కాపు సంఘం రామమందిరం వద్ద కుంచే విజయకుమార్, ధనలక్ష్మి దంపతులు, కెఎస్‌రావు దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుంచే శంకరరావు, జవ్వాది రత్తయ్య, దాసరి నాంచారయ్య, జొన్నకూటి వెంకటేశ్వరరావు, కూరేటి శ్రీనివాసరావు, పురం అప్పారావు, పురం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మాస్"స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మేరీమాత దీక్షాపరులకి ప్రేమవిందు



**తెనాలి టౌన్, మార్చి27,(ప్రభాతవార్త):**

మేరీమాత దీక్ష తీసుకున్న వారికి ప్రేమవిందు ఏర్పాటు చేయడం సంతోషమని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, శాసన సభ్యులు నక్కా ఆనందబాబు, జడ్పీ చైర్మన్ కత్తెర హెని క్రిస్టినా పేర్కొన్నారు. పట్టణంలోని చెంచుపేటలో ఉన్న ఆర్సీఎం చర్చి వద్ద మేరీమాత దీక్ష 500 మందికి మాస్ వ్యవస్థాపక అధ్యక్షులు సుద్దపల్లి నాగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రేమ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, వేమూరు శాసన సభ్యులు నక్కా ఆనందబాబు, జడ్పీ చైర్మన్ కత్తెర హెని క్రిస్టినా ముఖ్యఅతిథిగా విచ్చేసి దీక్షకులకు భోజనాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, ప్రేమ, భక్తిలో తీసుకునే దీక్షకులకు విందు ఏర్పాటు చేయడం అభినందనీయమని చెప్పారు. నక్కా ఆనందబాబు మాట్లాడుతూ, ఈ కార్యక్రమాన్ని ప్రతి ఏటా నిర్వహించే సుద్దపల్లి నాగరాజు అభినందనీయుడని అన్నారు. హెని క్రిస్టినా మాట్లాడుతూ, సుద్దపల్లి నాగరాజు ఇలాంటి సేవ కార్యక్రమాలు భవిష్యత్ లో మరెన్నో చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెదేపా కార్యనిర్వాహక కార్యదర్శి కత్తెర సురేష్ కుమార్, జనసేన నాయకులు గౌరీ శంకర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో కన్వీనర్ ఉన్నం ధర్మారావు మాదిగ, హార్వెస్ట్ ఇండియా అధినేత కత్తెర డేవిడ్ యస్వంత్, కొలకలూరి కిరణ్ కుమార్, అత్తోట శరత్, నలుకుర్తి రమేష్, లింగాల రమేష్, బోస్ బాబు, రావూరి సతీష్, కోట్ల దిలీప్, కొక్కిలిగడ్డ సునీల్, అనే రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఐజేయూ సభలకు వాటర్ బాటిల్ అందజేత

**వట్టిచెరుకూరు, మార్చి 26, ప్రభాతవార్త :** కృష్ణాజిల్లా, విజయవాడ శ్రీ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఈనెల 27, 28, 29 తేదీలలో నిర్వహిస్తున్న ఐజేయు 11వ ప్లీనరీ సమావేశాలకు గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు నియోజకవర్గ




ఏపీయూడబ్ల్యూజే బృందం మూడు రోజులకు అవసరమైన త్రాగునీటి బాటిల్స్ ను శుక్రవారం విజయవాడ ప్రెస్ క్లబ్ వద్ద ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐవి సుబ్బారావుకు అందజేసినట్లు నియోజకవర్గ అధ్యక్షులు జోగి ఆనందబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐవి సుబ్బారావు మాట్లాడుతూ.. విజయవాడ నగరంలో జాతీయస్థాయిలో మూడు రోజుల పాటు జరిగే ప్లీనరీ సమావేశాలకు హాజరయ్యే వారికి కావలసిన మంచినీటి బాటిళ్లను అందజేసినందుకు ఏపీయూడబ్ల్యూజే పత్తిపాడు నియోజకవర్గ కమిటీని ప్రత్యేకంగా అభినందించారు. ప్రత్తిపాడు నియోజకవర్గ ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షులు జోగి ఆనంద్ బాబు(హెచ్ఎం టీవీ), గుంటూరు జిల్లా అధ్యక్షులు ఎస్ఎన్ మీరా, బాపట్ల జిల్లా అధ్యక్షులు రాంబాబు, ఐజేయూ సభ్యులు కొంగర వెంకటసుబ్బయ్య(ఎన్ టీవీ), చందు సుబ్బారావు (తెనాలి), గుంటూరు జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు ఎస్ఎండి షరీఫ్(రాజ్ న్యూస్), పొనకల శ్రీనివాసరావు (స్వతంత్ర టీవీ), కొండేపాటి వీరయ్య (ప్రైమ్ 9 టీవీ), జెట్టి పరమేశ్వరావు (ఆంధ్రప్రభ), తదితరులు పాల్గొన్నారు.

## 30న తెనాలి ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో జాబ్ మేళా

**వట్టిచెరుకూరు, మార్చి 27, ప్రభాతవార్త:** గుంటూరు జిల్లా తెనాలి చినరావూరులోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ఈనెల 30వ తేదీన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కొండా సంజీవరావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సంజీవరావు మాట్లాడుతూ..ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము వారి ఆదేశముల మేరకు రాష్ట్రంలోని నిరుద్యోగ సమస్యను రూపుమా పడానికి కృషి చేస్తుందని వివరించారు. దీనిలో భాగముగా నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ మేళాలు నిర్వహించి ఉద్యోగ అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన తెనాలిలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ నందు జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిసర ప్రాంత నిరుద్యోగ యువతి యువకులు ఈ జాబ్ మేళాలలో పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈజాబ్ మేళాకు ఎస్.ఎస్.సి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, బి.టెక్, డిప్లొమా, ఫార్మసి, మరియు పి.జి వరకు చదువు కున్న 18నుండి 35 సం॥ల వయసు గల నిరుద్యోగ యువతి యువకులు వారి యొక్క బయోడేటా లేదా రెస్యూమ్, విద్యా సర్టిఫికేట్స్ జిరాక్స్, ఆధార్ నకలు మరియు పాస్పోర్ట్ ఫోటో తో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. 30వతేది ఉదయం గం.10 లనుండి సాయంత్రం గం.4ల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయని చెప్పారు. ముందుగా అభ్యర్థులు తమ పేర్లను **https://naipunyam.ap.gov.in** వెబ్ సైట్ నందు రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకోనటు వంటి అభ్యర్థులు జాబ్ డ్రైవ్ జరుగు ప్రదేశం నందు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చున్నారు. డి.రాజా 7893789361, వి. మణికంఠ గోపాల్ 9346890335ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

## రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి

### -తిరుమలశెట్టి ఉమాశంకర్

**పొన్నూరు, మార్చి 27,ప్రభాతవార్త:** రక్తదానం చేయండి...ప్రాణదాతలు కండి అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్ళాలని మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాప అధ్యక్షుడు తిరుమలశెట్టి



ఉమాశంకర్ సూచించారు. రామ్‌చరణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమలశెట్టి మాట్లాడుతూ మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంతో మందికి రక్తదానాన్ని అందించడం జరిగిందన్నారు. మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాలు నిర్వహించడానికి కానీ, సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి కానీ దాతలు, సామాజిక వేత్తలు, సమాజాభివృద్ధి కోసం పాటుపడేవారు సహకరించడమే ప్రధాన కారణమన్నారు. రక్తదానం చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార యక్రమంలో పలువురు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ సీతారామ గ్రామో త్సవం

**వట్టిచెరుకూరు, మార్చి 27, ప్రభాతవార్త :** శ్రీ రామనవమి సందర్భంగా మండలంలోని మేజర్ పంచాయతీ గ్రామం ముట్లూరు శ్రీ పట్టాభి రామస్వామి దేవస్థానం (దక్షిణవీధి) లో భక్తిభావంతో శ్రీరామ నవమి ఉత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. దేవాలయ ప్రాంగణంలో స్వామివార్లను పట్టు లతో చూడమచ్చడిగా సీతారామ స్వామివార్ల దివ్య అలంకరణక చేసారు. ఈ సందర్భంగా స్వామివారి దివ్య అలంకరణ భక్తులను ఆధ్యాత్మిక పరవశంలో ముంచెత్తింది. ముట్లూరులోని శ్రీ పట్టాభి రామస్వామి దేవాలయంలో ప్రతి సంవత్సరం జరిగే శ్రీ సీతారామ కళ్యాణం ఈ ఏడాది మరింత వైభవంగా నిర్వహించబడింది. ఆలయాన్ని పుష్పాలతో, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించి ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు. వేద మంత్రోచ్చారణల మధ్య అర్చకులు రమణాచార్యులు శాస్త్రోక్తంగా కళ్యాణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సీతా సమేత శ్రీ రామచంద్రస్వామి వారికి ప్రత్యేక అలంకరణ నిర్వహించారు.



పుష్పాలంకరణ, పట్టు వస్త్రాలు ఆభరణాలతో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ దివ్య దృశ్యాన్ని చూసేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు స్వామివారి ఆశీర్వాదాలను పొందుతూ భక్తి భావంతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమం అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఉత్సవమూర్తులను గ్రామములోని ప్రధాన వీధుల్లో సాయంత్రం బ్యాండ్ మేళాలతో భక్తులు, దేవాలయ కమిటీ సభ్యులు గ్రామోత్సవం నిర్వహించారు.

# తెదేపా ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరపాలి: ఎమ్మెల్యే జూలకంటి

**మాచర్ల, మార్చి 27, ప్రభాతవార్త:** ఈ నెల 29న తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పసుపు శ్రేణులు పండుగలా వేడుకలు నిర్వహించాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలు, గ్రామాలు, పట్టణ వార్డుల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసి ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకోవాలని కోరారు. అలానే పార్టీ దిమ్మెలకు రంగులు వేయించి, జెండా ఆవిష్కరించాలన్నారు. వేడుకల్లో చురుగ్గా పాల్గొని, విజయవంతం చేయాలని కేడర్‌కు ఆయన స్పష్టం చేశారు.



# తెదేపా కార్యకర్తల సంక్షేమమే పరమావధి: ఎమ్మెల్యే

**వెల్దుర్తి, మార్చి 27 ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమమే పరమావధి అని ఎమ్మెల్యే జూలకంటి చెక్కును ఎమ్మెల్యే జూలకంటి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కష్టకాలం కార్యకర్తలకు అండగా నిలవడంతో టీడీపీ



బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఇటీవల రెంటచింతల మండలం పాలువాయి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త దేరంగుల అప్పారావు ప్రమాదవశాత్తు మరణించగా, వారి కుటుంబ సభ్యులకు స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం గురువారం పార్టీ సభ్యత్వ ప్రమాద బీమా ద్వారా రూ.5 లక్షల నగదు ముందుంటుందన్నారు. రూ.100 పార్టీ సభ్యత్వం కార్యకర్త కుటుంబానికి ఆర్థిక అండగా నిలుస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మండలపు హనిమిరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు తేలుకుట్ల కోటిరెడ్డి, పార్టీ నాయకులు కొంగర సాంబయ్య, చిన్నోడు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత మంచినీటి చలివేంద్రం ఏర్పాటు ఆనందనీయం : డాక్టర్ సింగరాజు సాయికృష్ణ

సత్తెనపల్లి, మార్చి 27, ప్రభాతవార్త: స్థానిక సాయికృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ ,సింగరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో



నరసరావుపేట రోడ్ లోని హాస్పిటల్స్ ప్రాంగణంలో ఉచిత మంచినీటి చలివేంద్రాన్ని సాయికృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత ప్రముఖ వైద్యులు టీడీపీ నాయకులు డాక్టర్ సింగరాజు సాయికృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకీ పెరుగుతున్న ఎండ తీవ్రతని దృష్టిలో పెట్టుకొని నిత్యం రద్దీగా ఉండే నరసరావుపేట రోడ్ లో ఉచిత మంచినీటి చలివేంద్రం ఏర్పాటు చేయడం ఆనందం గా ఉందని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శ్రీరామనవమిని పురస్కరించుకొని ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేసి ప్రజలందరికీ పానకం మరియు వడపప్పు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అక్కడికి విచ్చేసిన ప్రజలకు వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు మరియు సూచనలు చేసి అందరికీ కరపత్రాలు అందజేశారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు, యువతీ యువకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఉచిత మంచినీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన సాయికృష్ణ మల్టీ స్పెషాలిటీ యాజమాన్యాన్ని అభినందించారు.

# వెంకట్రామిరెడ్డికు ఘన స్వాగతం

**గురజాల, మార్చి 27 ప్రభాతవార్త :** గుంటూరు జిల్లా జైలు నుంచి బెయిల్‌పై విడుదలై మాచర్ల పట్టణానికి వెళ్తున్న వైసీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డికి గురజాల పట్టణంలో వైసీపీ నేతలు ఘన స్వాగతం పలికారు. దుశ్శాలు వలతో ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో మాచర్ల నియోజకవర్గ పరిశీలకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు, రవి, ఎంపీపీ



వేముల శేషమ్మ చలమయ్య, చల్లా రామిరెడ్డి, వీరంరెడ్డి అమరారెడ్డి, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు సిద్ధారపు గాంధీ, కలకండ ఆంధ్రయ్య, కావూరి అంజిబాబు, వైసీపీ బూత్ కమిటి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్రా చిన కోటేశ్వరరావు, పట్టణ కార్యదర్శి కర్రా గిరిబాబు, బండి వీరభద్రుడు, సతీష్, పేరుపోగు చిన ఏలియా, గంధం చిన్న పిచ్చయ్య, కోట చందు తదితరులు పాల్గొన్నారు.

# రంగస్థల కళాకారులు చాంద్ భాషాకు ఘనసన్మానం

**సత్తెనపల్లి,మార్చి 27, ప్రభాతవార్త:** ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకొని సత్తెనపల్లి పట్టణంలోని రంగస్థల సీనియర్ కళాకారుడు, నాటక రచయిత సత్తెనపల్లి చాంద్ భాషాను స్థానిక రంగస్థల, సినీ కళాకారుల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సత్తెనపల్లి పట్టణంలోని సూర్య టాకీస్ వద్దగల రంప కోత మిషన్ ప్రాంగణంలో ఈ కార్యక్రమం శుక్రవారం జరిగింది. కళ కళ కోసం కాదు, కాసుల కోసం కాదు, కళ ప్రజల కోసం ప్రజా చైతన్యం కోసం పాటుపడిన నాడే కళాకారుడికి పరిపూర్ణత లభిస్తుందని వక్తలు మాట్లాడారు. 1975 లోనే అనేక బహుమతులు ప్రశంసలు అందుకున్న సీనియర్ కళాకారుడు, రచయిత చాంద్ భాషాని ఈ సందర్భంగా సత్కరించుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని వక్తలు ఆయన సేవలను



కొనియాడారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి సత్తెనపల్లి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి, సినీ నటులు వల్లెం లక్ష్మీ చెన్నకేశవరావు సభకు అధ్యక్షత వహించారు. చాంద్ భాషా వంటి సీనియర్ కళాకారుడిని శ్రీరామ నవమి రోజున సత్కరించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని వక్తలు అన్నారు. ఈ మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన చైతన్య కళా స్రవంతి కార్యదర్శులు గుండవరపు అమర్నాథ్, కల్లూరి నాగ బ్రహ్మచారిలకు పట్టణ కళాకారులు, రాజకీయ నాయకులు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జాతీయ కాంగ్రెస్ పార్టీ సత్తెనపల్లి పట్టణ అధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది జ్ఞానరాజు పాల్, లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్ పాస్వాన్ ) పల్నాడు జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్ కుమార్, నవ్యాంధ్ర టూవీలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు షేక్ సుభాని, వైసిపి నాయకులు జలీల్, ఏఐటీయూసీ పల్నాడు జిల్లా నాయకులు కంబాల శ్రీనివాసరావు, టిడిపి కళా సమస్త సత్తెనపల్లి పట్టణ అధ్యక్షులు, కళాకారుడు గుర్రం వెంకటేశ్వర్లు, న్యాయవాది షేక్ జానీ కాజావలి, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి సత్తెనపల్లి నియోజకవర్గ అధ్యక్షులు ముట్టే రాంబాబు, బంగారు నంది అవార్డు గ్రహీత లక్ష్మయ్య, ప్రముఖ కళాకారులు జొన్నలగడ్డ రత్నరాజు, పెద్దబ్బాయి. పి. వెంకటేశ్వర్లు, కాటమల దావీదు, షేక్ వలి, ప్రముఖ కళాకారులు మాతంగి సాంబశివరావు మాస్టారు, రచయిత్రి రమాదేవి, రసూల్ లతో తోపాటు హితులు సన్నిహితులు శ్రేయోభిలాషులు పాల్గొని చాంద్ భాషాను ఘనంగా సత్కరించారు.



**రమణీయం..కమనీయం..శ్రీసీతారాముల కళ్యాణం: శ్రీరామనవమి సందర్భంగా శుక్రవారం సత్తెనపల్లి రఘురామ్‌నగర్ ఎమ్మెల్యే కార్యాలయం సమీపంలోని శ్రీరామ మందిరంలో స్వామివారి కళ్యాణంలో పాల్గొన్న దంపతులు (సత్తెనపల్లి-ప్రభాతవార్త)**

# పిన్నెల్లి వెంకటరామిరెడ్డికి ఘనస్వాగతం

**మాచర్ల, మార్చి 27, ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసులో అరెస్టు అయి బెయిల్‌పై విడుదలైన నేపథ్యంలో వైసీపీ నాయకులు పిన్నెల్లి వెంకటరామిరెడ్డికి ఘనస్వాగతం పలికారు.



గుండ్లపాడు జంటహత్యల నేపథ్యంలో ఎ7గా ఉన్న పిన్నెల్లి వెంకటరామిరెడ్డికి గురజాల కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ రోజు విడుదలై మాచర్లకు చేరుకున్న నేపథ్యంలో భారీ ఎత్తున పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో మాచర్ల నియోజకవర్గ పరిశీలకులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

**గురజాల, మార్చి 27 ప్రభాతవార్త :** పట్టణంలో శుక్రవారం శ్రీరామనవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. రామాలయం కిరణ మర్చంట్స్ ఆధ్వర్యాన, గాంధీ బొమ్మ సెంటర్లోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద క్లాత్ మర్చంట్ ఆధ్వర్యాన





శ్రీసీతారాముల కళ్యాణం జరిపారు. అలాగే పంచముఖ ఆంజనేయస్వామి, రైల్వేగేటు ఆంజనేయస్వామి ఆలయం వద్ద శ్రీరామనవమి వేడుకలు కన్నుల పండువగా జరిపారు.

# సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు

**సత్తెనపల్లి, మార్చి 27, ప్రభాతవార్త:** మత సామరస్యంతో మెలగాలంటూ కుల,మతాలకు అతీతంగా శుక్రవారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. హిందూ, ముస్లిం, క్రైస్తవుడు ఎవరైతేనేం మానవుడే



జీవన సమరపు గమనంలో అలుపు ఎరుగని శ్రామికుడే...అంటూ సత్తెనపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శ్రీరామనవమి సందర్భంగా వడ పప్పు, పానకం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలో రహదారి వెంట వచ్చి వెళ్లే వారందరికీ వడపప్పు, పానకం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం కన్వీనర్ పొట్టి సూర్య ప్రకాష్ రావు, కమిటీ సభ్యులు అనంత వెంకట్ నారాయణ, ప్రజా సంఘాల నాయకులు డి విమల, జి ఉమాశ్రీ, ఇంజం అరుణ, అనుముల వీర బ్రహ్మం, కె సుధారాణి,జె రాజకుమార్, తుమ్మల లక్ష్మి, ఎస్ కె జానీ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

**రాజుపాలెం మార్చి 27, ప్రభాతవార్త:** మండలంలోని అన్ని గ్రామాల్లో సీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రమైన రాజుపాలెం జయంతి కాలనీలోని శ్రీ వైష్ణవ కోదండా రామాలయంలో అర్చకులు శ్రీ హనుమంతశాస్త్రి వేద మంత్రోత్సవాలతో ప్రజానీకం మధ్య సీతారాముల కళ్యాణాన్ని అత్యంత వైభవంగా కన్నుల పండుగ



జరిపించారు. స్వామి వారి కళ్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీరామనవమి హిందువులకు అత్యంత ముఖ్యమైన పండుగని, త్రేతాయుగంలో చైత్రశుద్ధ నవమి రోజున శ్రీరాముడి జన్మదినాన్ని పండుగగా జరుపుకుంటారని, శ్రీరాముడు చైత్యవంతుడు, ధర్మపరుడని, తండ్రి మాటకు కట్టుబడి జీవించిన ఆదర్శ పురుషుడని సీతారాములు లోకానికి ఆదర్శ దంపతులని వారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని అర్చకులు కోరుకున్నారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు శ్రీరాముడికి ఎంతో ఇష్టమైన వడపప్పు,పానకం, తీర్థప్రసాదాలను అందజేశారు.

# వినియోగదారుల హక్కుల పై మహిళలు అవగాహన కలిగి ఉండాలి

**చిలకలూరిపేట, మార్చి 27, ప్రభాతవార్త:** వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం మహిళలు అవగాహన కలిగి ఉండడం అత్యంత అవసరమని ..కన్స్యూమర్ రైట్ ప్రొటెక్షన్ ఫోరం పల్నాడు జిల్లా అధ్యక్షుడు మురికిపూడి ప్రసాద్ పేర్కొన్నారు. చిలకలూరిపేట పట్టణంలో వినియోగదారుల సంఘం



సభ్యులు బృందాలుగా ఏర్పడి నరసరావుపేట సెంటర్, కళామందిర్ సెంటర్, చౌత్రా సెంటర్ తదితర ప్రధాన వీధుల్లో మహిళలకు వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజువారీ జీవితంలో గ్యాస్ సిలిండర్ల వినియోగం, సరైన తూకాలు, పాటించడం, కల్తీ ఆహార పదార్థాల గుర్తింపు వంటి అంశాలపై మహిళలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

మార్కెట్‌లో కొంతమంది వ్యాపారులు తూకాల్లో మోసం చేయడం, నాణ్యత లేని వస్తువులను విక్రయించడం వంటి ఘటనలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగాగ్యాస్ సిలిండర్ తీసుకునేటప్పుడు పాటించవలసిన అంశాల గురించి వివరిస్తూ సిలిండర్ డెలివరీ తీసుకునే సమయంలో గ్యాస్ ఏజెన్సీ ఇచ్చిన బిల్లు మాత్రమే చెల్లించాలని, ఇతర చార్జీలు చెల్లించవలసిన అవసరం లేదని అన్నారు. అదేవిధంగా బరువు చెక్ చేసి సిలిండర్‌పై ఉన్న నెట్ వెయిట్ (సాధారణంగా ..14.2 కిలోలు) సరిపోతుందో లేదో డెలివరీ బాయ్ దగ్గరే తూకం వేయించాలని చెప్పారు.సీల్ పరిశీలించి సిలిండర్‌పై ఉన్న సీల్ సరిగా ఉందో లేదో తనిఖీ చేసుకోవాలని, తెరిచి లేదా డ్యామేజ్ అయిన సీల్ ఉన్న సిలిండర్ను తీసుకోవద్దని తెలిపారు.లీకేజీ సమస్య కూడా చెక్ చేసుకోవాలని, సిలిండర్ తీసుకునే ముందు గ్యాస్ వాసన వస్తుందో లేదో పరీక్షించి అనుమానం ఉంటే వెంటనే తిరస్కరించాలి అని సూచించారు. అనంతరం సిలిండర్ పై ఉన్న ఎక్స్పైరీ తేదీని ఎ,బి,సి,డి కోడ్ ద్వారా గడువు తేదీని గుర్తించి, గడువు ముగిసిన సిలిండర్ అయితే రిటర్న్ చేయాలని చెప్పారు. బిల్లు కూడా తీసుకోవాలని అన్నారు. కోశాధికారి బేబీ విక్రమ్ మాట్లాడుతూ కల్తీ పదార్థాల వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశమున్నందున నాణ్యమైన వస్తువులనే కొనుగోలు చేయాలని మహిళలకు సూచించారు. సమయంలో బిల్లు తీసుకోవడం అలవాటు చేసుకోవాలని హితవు చెప్పారు. ఈ సందర్భంగా వినియోగదారుల సంఘం సభ్యులు.... మహిళలకు కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రవి నాయక్, డాక్టర్ విద్యాసాగర్ గాలయ్య, పుష్పవల్లి, పొన్నం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానమే ఊపిరిగా.. 60వ పర్యాయం ప్రాణదాతగా నిలిచిన కాసారామ శ్రీను..

**చిలకలూరిపేట, మార్చి 27, ప్రభాతవార్త:** రక్తదానం అంటే కేవలం ఒక సాయం కాదు, ఒక ప్రాణాన్ని నిలబెట్టే యజ్ఞం. ఆ యజ్ఞాన్ని త్రికరణ శుద్ధిగా పాటిస్తూ,



అపదలో ఉన్నవారికి ఆపద్బాంధవుడిగా నిలుస్తున్నారు చిలకలూరిపేటకు చెందిన సామాజిక కార్యకర్త కాసారామ శ్రీను. తాజాగా ఆయన 60వ సారి రక్తదానం చేసి తన సేవా తత్పరతను చాటుకున్నారు. మానవత్వమే మిన్న అని మరోసారి నిరూపించారు.

**హైదరాబాద్‌లో అత్యవసర సాయం:**

చిలకలూరిపేటకు చెందిన సయ్యద్ జాన్ భీ (62) హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌లో శస్త్రచికిత్స జరుగుతుంది. ఆపరేషన్ సమయంలో అత్యంత అరుదైన బి నెగిటివ్ రక్తం 2 యూనిట్లు అత్యవసరంగా అవసరమైంది. కుటుంబ సభ్యులు దిక్కుతోచని స్థితిలో ఉండగా, కాసారామ శ్రీను కు సమాచారం అందింది. ఇది తెలిసిన వెంటనే ఏమాత్రం ఆలస్యం చేయకుండా, తన మిత్రమండలితో కలిసి హైదరాబాద్ చేరుకున్న శ్రీను , చిరంజీవి బ్లడ్ బ్యాంక్ ద్వారా స్వయంగా రక్తదానం చేసి బాధితురాలికి అండగా నిలిచారు. 60 సార్లు.. అలుపెరగని సేవ: ఒకటి కాదు, రెండు కాదు.. ఏకంగా 60 సార్లు రక్తదానం చేయడం అంటే అది సామాన్యమైన విషయం కాదు. తన రక్తంతో ఎందరో ప్రాణాలను కాపాడిన శ్రీను , నేటి యువతకు గొప్ప స్ఫూర్తిప్రదాతగా నిలుస్తున్నారు. రక్తం దొరక్క ఎవరూ ఇబ్బంది పడకూడదన్నదే తన లక్ష్యమని ఆయన నిరూపిస్తున్నారు. ఈ మానవీయ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న బైరా దిలీప్ చక్రవర్తి , రమణ స్వామి నాయుడు , మరియు మర్రిపూడి వెంకటేష్ శ్రీను సేవలను ప్రత్యేకంగా కొనియాడారు. 60 సార్లు రక్తదానం చేసి రికార్డు సృష్టించడమే కాకుండా, సమయానికి స్పందించి ప్రాణాలు కాపాడిన శ్రీనును, ఆయన మిత్రమండలిని అభినందించారు.

# జనసేన నాయకుల ప్రత్యేక పూజలు

**నరసరావుపేట టౌన్, మార్చి 27 ప్రభాతవార్త :** శ్రీరామనవమి పండగను పురస్కరించుకొని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలాని ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలను దేవాలయంలో నిర్వహించారు. పట్టణంలోని బరంపేట శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం నందు , అలాగే స్టేడియం నందు శ్రీరాముల వారి గుడి, మండలంలోని పమిడిపాడు గ్రామములో వివిధ శ్రీ



సీతారాముల కల్యాణ మహోత్సవ కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. ఆయా మండపాలలో నిర్వాహక కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా విచ్చేసిన జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి నరసరావుపేట ఇంచార్జ్ సయ్యద్. జిలాని పాల్గొని పూజలు చేశారు. అన్ని వర్గాల ప్రజలకు సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రొంపిచర్ల మండల అధ్యక్షులు అచ్చుల సాంబశివరావు, అధికార ప్రతినిధి షై. అష్రూఫ్,, కోటేశ్వరరావు,, శి. యాదవ్ ,,షై.ఖాజావలి,, తెడ్ల వెంకటేశ్వర్లు,, పార్ధసారధి, షై. బాషా, హనుమంత్ రావు,, గొట్టిపాటి శివ,, గొట్టిపాటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# పన్ను బకాయిలు చెల్లించండి : కమిషనర్

**నరసరావుపేట, మార్చి 27 ప్రభాతవార్త :** పురపాలక సంఘ పరిధిలో 202526 ఆర్థిక సంవత్సరం ఈనెల 31తో ముగియు చున్నందున ప్రాపర్టీ టాక్స్ / వాటర్ చార్జెస్



బకాయిలు చెల్లించాలని కమిషనర్ బి రవికుమార్ కోరారు. శుక్రవారం వసూలు లో భాగంగా పురవరిపాలనా శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 50 వడ్డీ రాయితీ పై పట్టణ ప్రజలకు ఆటో మైక్ ల ద్వారా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.వాహనములలో మొబైల్ కౌంటర్లు ఏర్పాటు చేసి అపార్ట్మెంట్ లు, కాలనీలలో వారి ఇళ్ళ వద్ద పేమెంట్ చేయించుకొని ఆన్లైన్ రశీదు లు అక్కడికక్కడే సిబ్బంది ఇచ్చారు. సెలవు రోజు అయినప్పటికీ కమీషనర్ , డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ , రెవిన్యూ ఆఫీసర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. హై ఎస్ట్ బకాయి దారుల వద్దకు వెళ్ళి ప్రాపర్టీ టాక్స్ బకాయిలు చెల్లించ వలసింది గా 50 వడ్డీ రాయితీ పై కూడా అవగాహన కల్పించారు. సంబంధిత రెవిన్యూ ఇనస్పెక్టర్లు , అడ్మిన్ సెక్రటరీస్, ఏమినిటీస్ సెక్రటరీస్ హాజరైనారు.

# పిన్నెల్లి వెంకట్రామిరెడ్డికి స్వాగతం పలికిన డాక్టర్ గోపిరెడ్డి

**నరసరావుపేట,మార్చి27 ప్రభాతవార్త :** మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి కి శుక్రవారం పట్టణంలో వైయస్సార్సీపి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. జంట హత్యల కేసులో బెయిల్ పై బయటకు వచ్చిన ఆయనకు నియోజకవర్గ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా శాలువా, పూలమాలలతో వెంకట్రామిరెడ్డిని సత్కరించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ అన్యాయంగా అనేక అక్రమ కేసులను పిన్నెల్లి సోదరులపై బనాయించారని గుర్తు చేశారు. అక్రమంగా తమ పార్టీ నేతలను, కార్యకర్తలను జైలుకు పంపిన అధికారులను, కూటమి నాయకులను వదిలిపెట్టబోమని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వ పాపాలు పండే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. రెడ్ బుక్



రాజ్యాంగ పాలన కు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారని పేర్కొన్నారు. మరి కొద్ది నెలల్లో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలలో కచ్చితంగా కూటమి పార్టీలకు ఓటమి మాత్రమే దక్కుతుందని డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ సువర్చలా సమేత ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ళ

**నాదెండ, మార్చి 27, ప్రభాతవార్త:** నాదెండ్ల మండలం ఎండుగుంపాలెం గ్రామం పరిధిలోని అక్కాయకుంట శ్రీ సువర్చలా సమేత ప్రసన్నాంజనేయ స్వామి వారి తిరునాళ్ళ



సందర్భంగా శుక్రవారం ఉదయం నుండే ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు స్వామివారి దర్శనానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండు భారీ విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు, భారీ అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

# వైభవంగా శ్రీరామ నవమి వేడుకలు

**నరసరావుపేట టౌన్, మార్చి 27 ప్రభాతవార్త :** నరసరావుపేట పట్టణంలోని సత్తెనపల్లి రోడ్ లో వేంచేసి ఉన్న శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో శ్రీరామనవమి



వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. 108 మంది దంపతులతో శ్రీ సీతారామచంద్రస్వామి వారి శాంతి కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. 108 మంది దంపతులకు ఉచితంగా పట్టు

# చలివేంద్రం ద్వారా స్వచ్ఛమైన తాగునీరు

**-జీడీసిసి బ్యాంక్ మాజీ డైరెక్టర్ వరప్రసాద్**

**పెదకూరపాడు,మార్చి 27,ప్రభాతవార్త :** వేసవికాలంలో ప్రజలు ఇబ్బంది పడకూడదని స్వచ్ఛమైన తాగునీటి(మినరల్ వాటర్)తో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని జిడిసిసి బ్యాంక్ మాజీ డైరెక్టర్, పెదకూరపాడు మాజీ ఎంపీపీ ఎన్ వి వి ఎస్ వరప్రసాద్ అన్నారు.నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో జన చైతన్య సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని స్టేట్ ఆడిట్ డిపార్ట్మెంట్ డిప్యూటీ డైరెక్టర్ కొర్లకుంట వెంకట సుబ్బారావుతో కలిసి శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా వరప్రసాద్



మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వేసవికాలంలో జన చైతన్య సమితి ప్రతినిధులు చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీరుస్తున్నారన్నారు. స్టేట్ ఆడిట్ డిపార్ట్మెంట్ డిప్యూటీ డైరెక్టర్ కొర్లకుంట వెంకట సుబ్బారావు మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున అత్యవసర పనులు ఉంటేనే బయటకు రావాలని మహిళలు, వృద్ధులు,చిన్న పిల్లలు జాగ్రత్తగా ఉండాలని అన్నారు.పెదకూరపాడు ఆర్ అండ్ బి రోడ్డు పక్కన సత్తెనపల్లి నుండి అమరావతి వెళ్లే వాహనదారులకు, పాదాచారులకు ఈ చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి తుళ్లూరి సాంబశివరావు మాట్లాడుతూ చలివేంద్రం ద్వారా తాగునీరు అందించటం పాటు మజ్జిగ, నిమ్మరసం,ద్రాక్ష రసం కూడా వారానికి రెండుసార్లు వాహనదారులకు, పాదాచారులకు అందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో జన చైతన్య సమితి కోఆర్డినేటర్ వెలితోటి అనిల్ కుమార్,కొర్రపాటి వెంకటేశ్వర్లు,షేక్ సుభాని, కొర్లకుంట శ్రీనివాసరావు, బెజ్జం నాగేశ్వరరావు, స్వరూప్,దారా ఫ్రాన్సిస్ తదితరులు ఉన్నారు. శ్రీరామనవమిని పురస్కరించుకొని జన చైతన్య సమితి బృందం ఏర్పాటు చేసిన పానకాన్ని 500 మందికి పంపిణీ చేశారు.

# నిరుపేద వృద్ధులకు భోజనం ప్యాకెట్ల అందజేత

**సత్తెనపల్లి, మార్చి 27, ప్రభాతవార్త:** సత్తెనపల్లి పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం శ్రీరామనవమి పండుగ, రంగా సురేష్ సోదరి తేజస్వి జన్మదిన సందర్భంగా వారి ఆర్థిక సహాయంతో భరతమాత అన్నప్రసాద వితరణ పథకం 784వ రోజు సత్తెనపల్లి పట్టణంలో పోలేరమ్మ తల్లి దేవాలయం వద్ద, బీజేపీ కార్యాలయం వద్ద, కొత్తపేట లోని మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద, నాగన్నకుంటలోని ఎన్. టి. ఆర్ విగ్రహం వద్ద నిరుపేద వృద్ధులకు ఎండలో తిరుగుతూ భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దివ్వెల శ్రీనివాసరావు మాట్లాడుతూ దాతలకు వారి కుటుంబ సభ్యులకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# గుంటూరుకు చేరిన హిందూపురం-అమరావతి సైకిల్ యాత్ర

## ఎమ్మెల్యే గళ్ళా మాధవిను మర్యాద పూర్వకంగా కలిసిన సైకిల్ యాత్రికుడు

**గుంటూరు,మార్చి 27, ప్రభాతవార్త:** హిందూపురం నుండి రాజధాని అమరావతి వరకు "ఒక్క అడుగు బాధ్యత వైపు" అనే లక్ష్యంతో మంజునాథ్ అనే యువకుడు చేపట్టిన సైకిల్



యాత్ర శుక్రవారం గుంటూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా సైకిల్ యాత్రికుడు శుక్రవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ. సమాజంలో హక్కుల కోసం పోరాటం జరుగుతున్నప్పటికీ బాధ్యతల పట్ల నిర్లక్ష్యం పెరుగుతున్నదని, ఈ నేపథ్యంలో మంజునాథ్ బాధ్యతను గుర్తు చేస్తూ చేపట్టిన ఈ యాత్ర అభినందనీయం అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి ఆశీస్సులతో ప్రతి గ్రామం, ప్రతి ఇంటిని సందర్శిస్తూ పిల్లలకు అవగాహన కల్పించడం గొప్ప కార్యక్రమమని, ప్రస్తుతం పోక్సో చట్టంపై సరైన అవగాహన లేకపోవడం వల్ల బాలికలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అబ్బాయిలు కూడా తెలియక తప్పిదాలకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, గుడ్ టచ్ - బ్యాడ్ టచ్, క్రమశిక్షణ, బాధ్యత వంటి అంశాలపై మంజునాథ్ గారు చేస్తున్న కృషి ప్రశంసనీయమని, తన వ్యక్తిగత పనులను పక్కనపెట్టి సమాజ సేవలో భాగంగా ఈ అవగాహన యాత్ర కొనసాగించడం నిజంగా అభినందించాల్సిన విషయం అన్నారు. సైకిల్ యాత్ర మొదలైన దగ్గర నుండి మార్గంలో ప్రజా ప్రతినిధులను కలుస్తూ, వారి మద్దతుతో ముందుకు సాగుతున్న ఈ యాత్రకు తాము పూర్తిగా మద్దతు ఇస్తామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.అలాగే, పోక్సో చట్టంపై అవగాహనను విద్యా వ్యవస్థలో భాగం చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.గౌరవ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారు ఇప్పటికే విద్యా రంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చిన నేపథ్యంలో, ఈ అంశాన్ని కూడా పాఠ్యాంశాల్లో చేర్చాలని కోరారు. రానున్న విద్యా సంవత్సరంలోనే పోక్సో చట్టంపై ప్రత్యేక పాఠ్యాంశం సిలబస్‌లో భాగం కావాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటి సమాజంలో సోషల్ మీడియా ప్రభావం కారణంగా పిల్లల్లో మార్పులు వేగంగా చోటుచేసుకుంటున్నాయని, అడల్ట్ కంటెంట్ వంటి అంశాలకు సులభంగా యాక్సెస్ లభించడం ఆందోళన కలిగించే విషయం అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో పిల్లలకు మాత్రమే కాకుండా తల్లిదండ్రులకు కూడా అవగాహన అవసరం ఉందని తెలిపారు.అలాగే, అనేక సందర్భాల్లో బాలికలు ఎదుర్కొనే సమస్యలను కుటుంబంలో చెప్పడానికి సంకోచించే పరిస్థితి ఉందని, ఈ సామాజిక ముద్రను తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లలు తమ సమస్యలను స్వేచ్ఛగా పంచుకునే వాతావరణాన్ని కుటుంబంలోనే సృష్టించాలని సూచించారు. మహిళా పోలీస్ స్టేషన్లలో నమోదవుతున్న కేసులను పరిశీలిస్తే పోక్సో కేసులు అధికంగా ఉన్నాయని, ఇది అవగాహన లోపాన్ని స్పష్టంగా చూపిస్తోందన్నారు. కాబట్టి ప్రజా ప్రతినిధులు, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, సామాజిక సంస్థలు కలిసి పనిచేసి ఈ సమస్యపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. సమాజంలో సానుకూల మార్పు కోసం మంజునాథ్ ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆకాంక్షించారు.

# శ్రీ సీతారామస్వామి దేవస్థానం (రజకపేట)లో సీతారాముల కళ్యాణ మహోత్సవం

**తెనాలి టౌన్, మార్చి27,(ప్రభాతవార్త):** పట్టణంలోని రజక పేటలో వేంచేసిన శ్రీ సీతారామస్వామి దేవస్థానం నందు మునిపల్లి నాగ ప్రకాష్ ధర్మపత్ని ఉదయలక్ష్మి నాగపూచిత దంపతులచే బ్రహ్మశ్రీ బి.వి సుబ్రహ్మణ్య శాస్త్రి



ఆధ్వర్యంలో శ్రీ సీతారాములకళ్యాణ మహోత్సవ తలంబ్రాలు కార్యక్రమం ఎంతో ఘనంగా అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో 38వార్డు



మాజీ కౌన్సిలర్ మునిపల్లి ప్రసాద్ మునిపల్లి ఆంజనేయులు మునిపల్లి రామకృష్ణ మునిపల్లి కామేశ్వరరావు మునిపల్లె మురళీకృష్ణ మునిపల్లి వెంకటేష్ శ్రీ సీతారామ స్వామి వారి గ్రామోత్సవం లో పాల్గొనడం జరిగినది.ఈ కార్యక్రమాన్ని, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర రజక సాధికారిక కమిటీ డైరెక్టర్ మునిపల్లి వెంకట దుర్గా ప్రసాద్ గారి పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు హాజరై శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని తిలకించారు. అనంతరం విచ్చేసిన భక్తులకు శ్రీ రాములవారికి ఇష్టమైన ప్రసాదం పానకం వడపప్పు పంపిణీ చేశారు.

# వాడ వాడలా ఘనంగా సీతారామ కళ్యాణ వేడుకలు

**పెదనందిపాడు, మార్చి 27, (ప్రభాతవార్త)** శ్రీరామనవమి సందర్భంగా శుక్రవారం పెదనందిపాడు మండలంలోని అన్ని గ్రామాల్లో



సీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. కుల మతాలకు అతీతంగా నిర్వహించే శ్రీరామ నవమి వేడుకలలో నూతన దంపతుల తలంబ్రాలు వేడుక లో సీతారాముల కళ్యాణం కన్నుల పండుగ నిర్వహించారు. పెదనందిపాడు కోదండ రామాలయంలో అభివృద్ధి కమిటీ చైర్మన్ మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ. వెలినేని కృష్ణారావు. చాగంటి సత్య హర్ష. కొమ్మరనేని రాకేష్. మొవ్వ నవీన్ ల ఆధ్వర్యంలో తిరుమల వేద పాఠశాల సీనియర్ విద్యార్థులు బృందావనం సుమంత్. హర్షవర్ధనలు పదిమంది దంపతులచే సీతారామ కళ్యాణ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. సాయంత్రం గ్రామంలో నిర్వహించిన వసంతోత్సవ వేడుకలలో యువత ఉత్సవంగా పాల్గొన్నది. నాగులపాడు లోని శ్రీ కోదండ రామాలయంలో ప్రధాన అర్చకులు ఉదయ్ కుమార్ శర్మ. త్రినాధ్ శర్మలు శ్రీ శృంగేరి శారద పీఠ పాలిత శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయాల సముదాయం అభివృద్ధి కమిటీ చైర్మన్ గొల్లపూడి సాంబశివరావు దంపతులచే సీతారాముల కళ్యాణ మహోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. తలంబ్రాలు కార్యక్రమంలో భీమవరం సీనియర్ సివిల్ జడ్జి ఎన్ సుధారాణి సింగారావు దంపతులు. పాటిబండ్ల సుబ్బారావు దంపతులు .కారుమంచి సాంబశివరావు దంపతులు. పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం పెదనందిపాడు. నాగులపాడు దేవాలయాల కమిటీ ల ఆధ్వర్యంలో వేలాదిమందికి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

# ఆధ్యాత్మికతతోనే సమాజానికి శాంతి

## -జొన్నలగడ్డలో వైభవంగా సీతారాముల కళ్యాణం - ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బలసాని

**వట్టిచెరుకూరు, మార్చి 26, ప్రభాతవార్త :** గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు నియోజకవర్గం, గుంటూరు రూరల్ మండలం, జొన్నలగడ్డ గ్రామంలో గల శ్రీ కోదండ రామాస్వామి వారి దేవాలయంలో శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కళ్యాణ మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల నడుమ అర్చకులు సంప్రదాయబద్ధంగా సీతారాముల కల్యాణాన్ని నిర్వహించగా, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. ఉదయం నుంచే ఆలయం భక్తులతో నిండిపోయింది. ఈ సందర్భంగా బలసాని మాట్లాడుతూ ఆధ్యాత్మికతతోనే సమాజంలో శాంతి, సౌభాగ్యాలు నెలకొంటాయన్నారు. ఇటువంటి ధార్మిక కార్యక్రమాలు మన సంస్కృతి పరిరక్షణకు దోహదపడతాయని పేర్కొన్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని రాష్ట్ర ప్రజల అభ్యున్నతి కోసం ప్రత్యేక పూజలు చేశారు.



ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జొన్నలగడ్డ గ్రామం మొత్తం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది.

**ఘనంగా ఐటీ సెల్ అధ్యక్షులు నాగరాజు యాదవ్ జన్మదిన వేడుకలు..**

ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఐటీ సెల్ అధ్యక్షులు గండు నాగరాజు యాదవ్ పుట్టినరోజు వేడుకలు నియోజకవర్గం సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జన్మదిన కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మిఠాయిలు పంపిణీ కార్యక్రమం. నాగరాజు ప్రతి సంవత్సరం రెండు పండుగలు చేసుకునే అదృష్టం కలిగి ఉన్నారని చెప్పారు. ఒకటి శ్రీరామనవమి పండుగ, రెండవది పుట్టినరోజు వేడుకలు, రెండు ఒకేరోజు రావడం చాలా ఆనందం అన్నారు. ఈ అదృష్టం నాగరాజుకి భగవంతుడు కలిగించినట్లు వివరించారు.

**వైసీపీ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు..**

ప్రతిపాడు నియోజకవర్గం, గుంటూరు రూరల్ మండల పరిధిలోని ఏటుకూరు బైపాస్ వద్దనున్న నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం శ్రీరామనవమి పండుగ వేడుకలు పార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. నవమి పండుగ సందర్భంగా కార్యాలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. స్వామి వారి ఆశీస్సులులతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, పాడిపంటలతో ఉండాలని పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు, కార్యకర్తలకు పానకం, మరియు వడపప్పు పంపిణీ చేశారు

# తల్లి జన్మనిస్తే రంగస్థలం జీవితాన్నిచ్చింది

## మాఎపి అధ్యక్షులు దిలీప్ రాజా

**తెనాలి టౌన్, మార్చి27,(ప్రభాతవార్త):** తల్లి జన్మనిస్తే రంగస్థలం జీవితాన్నిచ్చిందని మాఎపి వ్యవస్థాపకులు,సినీదర్శకుడు దిలీప్ రాజా పేర్కొన్నారు.ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా స్థానిక మాఎపి కార్యాల్నయలో శుక్రవ్వార ప్రపంచ రంగస్థల దినోత్సవ వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పెదరావూరు ఫిలిం స్టూడియోస్ మేనేజర్ పినపాటి సురేష్ బాబు అధ్యక్షత వహించారు.1961లో వియన్నలో 9 వ ప్రపంచ కాంగ్రెస్ సభల అధ్యక్షుడుఖి ఆర్వీకివియాఖి ప్రపంచ రంగస్థల దినోత్సవ




ప్రతిపాదనలు చేయగా । 962 లో ఫ్రాన్స్ దేశంలో ఖిజీన్ కాక్తేఖి తొలిసారి ప్రపంచ రంగస్థల దినోత్సవం నిర్వహించారని దిలీప్ రాజా తెలిపారు.నాటి నటుడు శివాజి గణేశన్ నుండి కోట శ్రీనివాసరావు వరకు రంగస్థలం నుండి వెండితెరపై రాణించారని ఆయన వివరించారు.మేకప్ వేసుకునే ప్రతి నటీనటుడు మార్చి 27న ప్రపంచ రంగస్థల దినోత్సవం నిర్వహించాల్సిన నైతిక భాధ్యత ఉందన్నారు.ఈ సందర్భంగా రంగస్థల నటులు దేవిశెట్టి కృష్ణారావు,వసంత యామిని,చందు సూర్యలను ఖిమాఎపిఖి సత్కరించింది.తమకు జరిగిన సత్కారానికి సన్మాన గ్రహీతలు ఖిమా ఎపిఖి కు కృతజ్ఞతలు తెలిపారు.సమావేశంలో దర్శకుడు అచ్చన శ్రీనివాస్ యాదవ్,కాస్ట్యూమ్ డిజైనర్ పార్వతి పట్నాల,సూర్యనారాయణ,మంచాల కిషోర్ బాబు పాల్గొన్నారు.

# సూర్య శిల్పశాల ఆధ్వర్యంలో

## అయోధ్య బాలరాముని విగ్రహానికి ప్రత్యేకపూజలు

**తెనాలి మున్సిపాలిటీ ,మార్చి27,(ప్రభాతవార్త):** తెనాలి పట్టణానికి చెందిన ప్రముఖ శిల్పశాల,సూర్య శిల్పశాల వారిచే అయోధ్య బాలరాముని అద్భుత దృశ్యాన్ని ఆవిష్కరించారు.శ్రీరామ నవమి పండుగ సందర్భంగా అయోధ్యలోని బాల రాముడి విగ్రహాన్ని అదే మాదిరిగా అత్యద్భుతంగా తీర్చిదిద్దారు. శుక్రవారం ఉదయం నుండి



శిల్పశాల వద్ద ప్రదర్శనగా ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. దాదాపు ఐదు నెలల పాటు శ్రమించి 4.5 అడుగుల ఎత్తులో 50 కేజీలో బరువుతో త్రీడి టెక్నాలజీతో అయోధ్య పాల రాముని విగ్రహాన్ని తయారు చేసినట్లు శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర, శ్రీ హర్ష తెలిపారు. అచ్చం అయోధ్య బాల రాముని రూపంలో ఉన్న విగ్రహాన్ని ప్రజలు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

# అత్యంత వైభవంగా శ్రీరామనవమి శోభాయాత్ర

**గుంటూరు విద్య,మార్చి 27, ప్రభాతవార్త :** గుంటూరు నగరంలో శ్రీరామ నవమి శోభాయాత్ర ఎంతో వైభవంగా కొనసాగింది శ్రీరామనవమి నాడు శ్రీరామ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జరిగే ఈ శోభాయాత్రికి గుంటూరులో ఉన్న రామ భక్తులు,హనుమాన్ భక్తులు, హిందువులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు... ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షులు కారం శెట్టి లోకేష్ గుప్తా మాట్లాడుతూ గుంటూరు నగరంలో శ్రీరామ నవమి నాడు శ్రీరామనవమి శోభాయాత్ర 8 ఏళ్లుగా గార్డెన్స్ వెంకటేశ్వర దేవస్థానం నుండి నిర్వహిస్తున్నామని ఈ ఏడాది తొమ్మిదవ సారి శోభాయాత్రను నిర్వహిస్తున్నామన్నారు. ఈ శోభాయాత్రలో గుంటూరుకు సంబంధించిన ప్రజాప్రతినిధులు మరియు ప్రముఖ వ్యాపార వ్యక్తులు హిందువులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.. ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షులు లోకేష్ గుప్తా మాట్లాడుతూ... గార్డెన్స్ లోని శ్రీ వెంకటేశ్వర దేవస్థానం నుంచి మొదలైన ఈ శోభాయాత్ర పట్టాభిపురం, నగరం పాలెం, హనుమాన్ సెంటర్, బస్టాండు, పాత గుంటూరు, చందన బ్రదర్స్, పట్నం బజార్ లోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం మీదగా రామనామ క్షేత్రం చేరడంతో ముగిస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తాల్లయ్యపాలెం శైవ క్షేత్ర పీఠాధిపతి శివ స్వామి జెండా ఊపి శోభాయాత్రని



ప్రారంభించారు.గల్లా మాధవి ,నసీర్ అహ్మద్ ,కన్నా లక్ష్మి నారాయణ మరియు ఉత్సవ సమితి ముఖ్య కార్యకర్తలు వేణుగోపాల్, చల్లా బ్రహ్మారెడ్డి, ఫణింద్ర,చరణ్,మధు,ప్రవీణ్ అంకారావు,జానకి, సుబ్బారావు,సంజీవ్, ముందుండి యాత్ర నడిపించారు.

# శ్రీ కోదండరామస్వామి వారి దేవస్థానంలో వసంత నవరాత్రి వేడుకలు

**తెనాలి మున్సిపాలిటీ,మార్చి27,(ప్రభాతవార్త):** స్థానిక మారీస్ పేటలో వేంచేసి ఉన్న శ్రీ కోదండ రామస్వామి వారి దేవస్థానం (రామభక్త అప్పలస్వామి గుడి)లో 30వ వసంత నవరాత్రి వేడుకలు



శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ముందుగా ప్రాత కాలంలో దేవతామూర్తులకు పంచామృత అభిషేకం విశేషా అర్చన జరిగాయని,20వ తారీకు నుండి 26వ తారీకు వరకు ప్రతిరోజూ శాంతి కళ్యాణం జరిగాయి,27వ తారీకు మత్రిపూడి రాంబాబు అనురాధ దంపతులచే శ్రీ సీతారాముల వారి కళ్యాణం మరియు 4000 మందికి అన్న ప్రసాద వితరణ జరిగింది,28 వ తారీకు పట్టాభిషేకం, మరియు స్వామివారి గ్రామోత్సవం 29వ తారీకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం,30వ తారీకు ద్వాదశ ప్రదక్షిణాలతో శ్రీరామనవమి వేడుకలు పూర్తవుతాయని, భక్తులందరూ విశేష సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ఆలయ ధర్మకర్త లంక. శివానంద్ కుమార్ తెలియజేశారు,ఈ కార్యక్రమాల్లో ధర్మకర్తలు కునపల్లి నారాయణస్వామి, లంక శివానంద్ కుమార్, శివాంజనేయ ప్రసాద్, తదితరులు పాల్గొనగా, శంకరమంచి అరుణ్ కుమార్ శర్మ మరియు ఆలయ ప్రధాన అర్చకులు దినములు ధనుష్ సుబ్రహ్మణ్య శర్మ క్రతువు లను నిర్వహించారు.

# వైభవంగా షిరిడి సాయి మందిరంలో శ్రీరామనవమి మహోత్సవం

**గుంటూరు విద్య, మార్చి 27, ప్రభాతవార్త :** స్థానిక పొన్నూరు రోడ్డులోని షిరిడి సాయి మందిరంలో 12వ శ్రీరామనవమి మహోత్సవం అత్యంత వైభవంగా మరియు భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది. ఈ వేడుకల్లో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే శ్రీ మహమ్మద్ నసీర్ మరియు మాజీ ఎమ్మెల్యే శ్రీ లింగంశెట్టి ఈశ్వరరావు



ముఖ్య అతిథులుగా పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ మహమ్మద్ నసీర్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం జరుగుతున్న యుద్ధాలు తక్షణమే ఆగిపోవాలని, విశ్వమంతా శాంతి వర్ధిల్లాలని ఆకాంక్షించారు. శ్రీరాముని ఆదర్శాలు సమాజంలో శాంతిని, సోదరభావాన్ని పెంపొందిస్తాయని, యుద్ధాల వల్ల కలిగే వినాశనాన్ని ఆపి అందరూ సుఖశాంతులతో ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.ఉదయం 9 గంటలకు వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య సీతారాముల కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఈ పవిత్ర క్రతువులో శ్రీ ..కొండేపాటి హనుమయ్య మరియు లక్ష్మీ కుమారి.. దంపతులు పీటల మీద కూర్చుని శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు.అభిషేకము ఉదయం షిరిడి సాయినాధునికి భక్తిశ్రద్ధలతో విశేష అభిషేకము నిర్వహించారు.అన్నప్రసాదం మధ్యాహ్నం 1 గంట నుండి భక్తులందరికీ భారీ స్థాయిలో అన్నప్రసాద వితరణ జరిగింది.ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే శ్రీ లింగంశెట్టి ఈశ్వరరావు , మిర్చి యార్డు డైరెక్టర్ కొనగల సత్యనారాయణ శివారెడ్డి కూడా పాల్గొని ఆలయ అభివృద్ధిని కొనియాడారు. కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేసినందుకు నిర్వాహకులు రావూరు లక్ష్మీనారాయణ శాస్త్రీ మరియు చెరుకూరి రమేష్ బాబు లు భక్తులకు, సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# వివిఐటియూలో "నేషనల్ ఆర్చరీ ఛాంపియన్ షిప్" ప్రారంభం

**గుంటూరువిద్య,మార్చి27,ప్రభాతవార్త :** వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్శిటీ నందు ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో "చెరుకూరి లెనిన్ వోల్గా మెమోరియల్ నేషనల్ ఆర్చరీ ఛాంపియన్షిప్" పోటీలను ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ ప్రెసిడెంట్ నందమూరి తేజస్విని, ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ (శాప్) ఎండీ ఎస్. భరణి, ఎన్.టి.ఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మి మ్రిషా, వివిఐటియూ ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ ప్రారంభించారు. మార్చి 27 నుండి ఏప్రిల్ 7 వరకు వివిఐటి విశ్వవిద్యాలయం క్యాంపస్ నందు ఈ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలలో పాల్గొనేందుకు దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుండి 2300 మంది ఆర్చరీ క్రీడాకారులు,




కోచ్‌లు హాజరయ్యారు. అండర్ 10, అండర్ 13, అండర్ 15 విభాగాలుగా నిర్వహించనున్న పోటీలలో తొలి రోజున 723 మంది పోటీదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ ప్రెసిడెంట్ నందమూరి తేజస్విని మాట్లాడుతూ, రాష్ట్రం నుండి అంతర్జాతీయ స్థాయి ఆర్చర్లను తయారు చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. ఇంత పెద్ద ఎత్తున జాతీయ స్థాయి పోటీలను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.శాప్ ఎండీ ఎస్. భరణి మాట్లాడుతూ, ముఖ్యంగా గిరిజన ప్రాంతాల యువతపై దృష్టి సారించి వారిలోని నైపుణ్యాలను వెలికితీస్తామని, వారిని అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు శాప్ కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. అలాగే ఆర్చరీ క్రీడను ప్రోత్సహిస్తున్న చెరుకూరి లెనిన్ వోల్గా అసోసియేషన్ కృషిని అభినందించారు. వివిఐటియూ ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ, ఆర్చరీ వంటి క్రీడలు విద్యార్థులలో ఏకాగ్రతను, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని, అటువంటి పోటీలకు తమ విశ్వవిద్యాలయం వేదిక కావడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిఐటియూ రిజిస్ట్రార్ డా౹౹ వై. మల్లికార్జునరెడ్డి, ఇండియన్ ఆర్చరీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ చెరుకూరి సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్ డా౹౹ ఎన్. అరుణ్ కుమార్ పాల్గొన్నారు

# ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు

**కొల్లూరు, మార్చి 27, (ప్రభాతవార్త) :** శ్రీరామ పర్వదినాన్ని పురస్కరించుకుని కొల్లూరు మండలంలోని పలు గ్రామాల్లోని రామాలయాలలో భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలలో మహిళలు ఎక్కువ సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల పాలకవర్గ సభ్యులు భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా తాటాకు పందిళ్ళు



ఏర్పాటు చేసి త్రాగునీరు అందించారు. మండల పరిధిలోని చిలుమూరు, కోటిపల్లి, కొల్లూరు గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పానకం, ప్రసాదంగా భక్తులకు అందజేశారు. కొల్లూరు గౌడపాలెం శ్రీ కోదండ రామాలయంలో మహిళలు కోటాల ప్రదర్శనలతో భక్తులను అలరించారు.

# తాగునీటి ఇబ్బందులు తొలగించండి

## మున్సిపల్ కమిషనర్ ఆదేశాలు

**తెనాలి మున్సిపాలిటీ, మార్చి27,(ప్రభాతవార్త):** ఎండాకాలం దృష్ట్యా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలుగకుండా యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తిచేసి మంచినీటి సరఫరాను పునరుద్ధరించాలని, మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు



సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని మారీసు పేట రాజీవ్ గృహకల్ప అపార్ట్మెంట్లో మంచినీటి పైప్లైన్ మరమ్మత్తులను పరిశీలించిన కమిషనర్, అపార్ట్మెంట్ లో తాగునీటి సరఫరా గురించి స్థానికులతో మాట్లాడారు అనంతరం 13వ బ్లాక్ వద్ద జరుగుతున్న పైప్ లైన్ పనుల పురోగతి వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎండాకాలంలో పట్టణంలో ఏ ప్రాంతంలోనైనా మంచినీటి సరఫరాలు ఇబ్బందులు ఎదురైతే పౌరపాలక సంఘ కార్యాలయానికి తెలియపరచాలని వెంటనే తమ సిబ్బందితో సమస్యను పరిష్కరిస్తామని కమిషనర్ రామ అప్పలనాయుడు తెలిపారు.కమిషనర్ వెంట డిఈఈ శ్రీనివాసరావు, మున్సిపల్ ఏఈ బాషా ఇతర సిబ్బంది ఉన్నారు.

# పిల్లలు సమాజాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలి : సిస్టర్ విద్య

**తాడేపల్లి,మార్చి 27,ప్రభాతవార్త :** గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ స్వచ్ఛంద సంస్థ వారి చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టులో భాగంగా శుక్రవారం తాడేపల్లి మండల పరిధిలోని డోలాస్‌నగర్ ప్రాంతంలో "సమాజాభివృద్ధిలో పిల్లల పాత్ర " అనే నినాదంతో బాల గంగాధర్



తిలక్ బాలల పార్లమెంట్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సిస్టర్ విద్య మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో పిల్లలు అత్యంత కీలకమైన భాగస్వాములు,భవిష్యత్తు నిర్మాతలు వారు తమ సృజనాత్మకత,కొత్త ఆలోచనలు,ఉత్సాహంతో సామాజిక మార్పుకు దోహద పడతారని,నేటి పిల్లలే రేపటి నాయకులు వారు సమాజ నిర్మాణానికి అవసరమైన మెట్లు అని అన్నారు.కమ్యూనిటి ఆర్గనైజర్ అత్తోట పోతురాజు మాట్లాడుతూ ఈ రోజుల్లో పిల్లలు సాంకేతికంగా చాలా పరిజ్ఞానం కలిగి ఉండి,పాత పద్ధతులను ప్రశ్నిస్తూ కొత్త పరిష్కార మార్గాలను కనుగొనగలుగుతున్నారని ఇది సామాజిక,సాంకేతిక అభివృద్ధికి సహాయపడుతుందన్నారు.భగత్‌సింగ్ బాలల పార్లమెంట్ మినిస్టర్స్ చేత ప్రమాణ స్వీకారం చేయించడం జరిగింది.కార్యక్రమంలో సిస్టర్ విద్య,అత్తోట పోతురాజు,కమ్యూనిటీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గో పూజ

**గుంటూరు విద్య, మార్చి 27, ప్రభాతవార్త** గుంటూరు స్థానిక నెహ్రూ నగర్ లోని గోశాల యందు అధ్యక్షులు కేవీ బ్రహ్మం ఆధ్వర్యంలో శ్రీరామనవమి పండగ పురస్కరించుకొని గోపూజ మరియు గో సేవను ఘనంగా నిర్వహించారు. కేవీ బ్రహ్మం



మాట్లాడుతూ సకల దేవతా స్వరూపమైన గోవుని పూజించటం వలన సకల దోషాలు నివారించబడతాయని శ్రీరామనవమి పండుగనాడు గోమాతను పూజించటం ఇంకా ఉత్తమమని తెలిపినారు. ముందుగా ఆవోపా సభ్యులు గోమాతను శుభ్రంగా కడిగి పసుపు కుంకుమలతో పూజలు నిర్వహించి వాటికి ఆహారాన్ని అందించి ఆశీస్సులు పొందినారు. ఈ కార్యక్రమంలో మహంకాళి శ్రీనివాసరావు, మద్ది సాయి రమేష్. గోపాల్ రావు, శివాజీ, సునీల్ పాల్గొన్నారు.

# ఓబీసీ మహిళా సబ్ కోటా పై అన్ని పార్టీలు మౌనం వీడాలి : కేసన శంకరరావు

**మంగళగిరి, మార్చి 27, ప్రభాతవార్త :** 2023 లో చేసిన మహిళా రిజర్వేషన్ చట్టానికి సవరణ చేసి, కేంద్రం 2029 నుండే అమలు జరపాలనుకోవడాన్ని స్వాగతిస్తున్నామని,కానీ గత మూడు దశాబ్దాలుగా ఓబీసీ సంఘాలు పోరాడుతున్న ఓబీసీ మహిళల ఉపకోటా గురించి నోరెత్తకుండా అన్ని పార్టీలు మౌనం వహించడమేంటని,ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శంకరరావు సూటిగా ప్రశ్నించారు.ఈరోజు స్థానిక మంగళగిరి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆ మేరకు కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇంకా వారు ఓబీసీ మహిళలకు సబ్ కోటా తేల్చకుండా మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయడాన్ని అన్ని జాతీయ ఓబీసీ సంఘాలతో పాటుమొత్తం ఓబీసీ సమాజం తీవ్రంగావ్యతిరేకిస్తుందన్నారు."తాను ఓబీసీనే"అన్న ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ఎన్డీఏ కూటమి ప్రభుత్వంపక్షాలకు గాని, అణగారిన వర్గాల ముఖ్యంగా ఓబీసీల అభ్యున్నతే మా లక్ష్యమనే కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి పార్టీలు గానీ, మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళల సబ్ కోటా గురించి ఎందుకు మాట్లాడడం లేదో ఓబీసీల పట్ల వారికున్న చిత్తశుద్ధి ఏపాటిదో తెల్పాలన్నారు. దేశ జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న ఓబీసీల ప్రధాన డిమాండ్లపై మౌనం వహించడం గాని తాత్సారం చేయడం గాని పాలక ప్రతిపక్షాలకు తగదన్నారు. పేద బడుగు శ్రామిక వర్గ రాజ్య స్థాపనే మా లక్ష్యమనే కమ్యూనిస్టు పార్టీలు కూడా ఈ విషయమై మాట్లాడకుండా మౌనం వహించటం ఆశ్చర్యం కలిగిస్తుందని వారు ఆవేదన చెందారు. భారతీయ ఆధిపత్య పెత్తందారీ మనువాద సమాజంలో అనాదిగా అన్ని రంగాలలో వెనుకబడి ఉన్న ఓబీసీ మహిళలు,అన్ని హంగులున్న అగ్రవర్ణ మహిళలతో ఎన్నికలలో పోటీపడి పార్లమెంటులో అడుగుపెట్టడం అసాధ్యమని అన్ని రాజకీయ పార్టీల నాయకులకు తెలియదా అన్నారు. ఇదే విషయమై ఆనాడు ములాయం లాలూ శరద్ యాదవత్రయం నిలదీయ బట్టే కదా..ఈ బిల్లును 30 ఏళ్ల పాటు ఆటకెక్కించింది... మరి నాటి నుండి నేటి వరకు మూడు దశాబ్దాలుగా ఈ అంశంపై ఓబీసీ సంఘాలు ఉద్యమిస్తూనే




ఉన్నప్పటికీ, "చెవిటి వాని చెవిలో శంఖం ఊదినట్లు"గత ప్రభుత్వాలన్నీ పెడచెవిన పెట్టాయన్నారు. ఓబీసీల ఓట్లతో గద్దెనెక్కే నేటి అన్ని పాలక ప్రతిపక్ష పార్టీలు ఓబిసి మహిళలకు సామాజిక న్యాయం అందించాల్సిన బాధ్యతను విస్మరించడం అన్యాయమన్నారు.గత ప్రభుత్వాలన్నీ పెడచెవిన పెట్టినా ఈనాటి ఒక ఓబీసీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వం లోని కేంద్ర ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కూడా"నిమ్మకు నీరెత్తినట్లు"ఉండటం తగదన్నారు. రాష్ట్రంలో తమది బీసీల పార్టీ అంటే..కాదు తమదే అసలైన బీసీల పార్టీ అంటూ పోటీ పడే తెలుగుదేశం వైసీపీ జనసేన పార్టీలు మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు ఉపకోటా ఇప్పించి సామాజిక న్యాయం అందించాల్సిన బాధ్యత లేదా అన్నారు. అందుకే రాష్ట్రంలోని డబల్ ఇంజన్ ప్రభుత్వ పక్షాలతో పాటు వైసీపీ కూడా ఈ అంశంపై మౌనం వీడి అన్ని పక్షాలు కేంద్రంపై ఒత్తిడి పెంచాలన్నారు. ఓబీసీ సంఘాల ఆశలుఆకాంక్షల మేరకు జనగణనతో పాటు సమగ్ర కుల గణన నియోజకవర్గాల పునర్విభజనలతో పాటు ఓబిసి మహిళలకు సబ్ కోటా చట్ట సవరణలను ఈ పార్లమెంటు సమావేశాలలోనే చేసి,2029 నుండే నూతన మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలని శంకరరావు భారత ప్రభుత్వానికి పార్లమెంటుకు మొత్తం రాజకీయ వ్యవస్థకు విజ్ఞప్తి చేశారు. ఇంకా ఈ మీడియా సమావేశంలో రాష్ట్ర యువజన అధ్యక్షులు పారేపల్లి మహేష్, రాష్ట్ర అధికార ప్రతినిధి అంగడాల పూర్ణచంద్రరావు, రాష్ట్ర కార్యదర్శి కోవెల కారు శివరాం బాబాజీ, రాష్ట్ర నాయకులు మేకా వెంకటేశ్వరరావు,లవ కుమార్,జి.రామకృష్ణ పాల్గొని ప్రసంగించారు.

# వాడవాడలా శ్రీరామనవమి వేడుకలు

**-భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు**
**-జై శ్రీరామ్....జైజై శ్రీరామ్ నినాదంతో మార్మోగిన కళ్యాణ మందిరాలు**
**-పెద్ద ఎత్తున అన్న సంతర్పణలు**
**-ఎక్కడ చూసినా....పండుగ శోభే**
**-వ్యాపార సంస్థల వద్ద పానకం, వడపప్పు పంపిణీ**

పొన్నూరు, మార్చి 27,ప్రభాతవార్త: ఏక పత్నీ వ్రతుడు..ఆదర్శవంతమైన రాజు..... తండ్రిమాట జవదాటని వాడు.....న్యాయం... ధర్మం. ..సత్యం...పలికేవాడు...సర్వజగద్రక్షుడు....అయిన శ్రీరాముని శ్రీరామనవమి వేడుకలను మండల, పట్టణ పరిధిలో శ్రీరామాలయాల్లో....వివిధ అసోసియేషన్లు, వివిధ వ్యాపార సంస్థల ఆధ్వర్యంలో...ఒక్క మాటలో చెప్పాలంటే వాడవాడలా శ్రీరామనవమి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా, శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయాలను, వివిధ చోట్ల ఏర్పాటు చేసిన మండపాల వద్ద రాములోరి కళ్యాణ వేడుకలను శాస్త్రోక్తంగా జరిపారు. ముందుగా పేర్లు నమోదు చేసుకొన్న పలువురు దంపతులు స్వామివారి కళ్యాణోత్సవంలో పాల్గొని స్వామివారికి ముత్యాల తలంబ్రాలను అందజేశారు. పెద్ద ఎత్తున అన్న సంతర్పణలు, పానకం, వడపప్పు, తదితర ప్రసాదాల వినియోగం జరిగింది.









**తెలగపాలెంలో....**

జీబీసి రోడ్డులోని తెలగపాలెం కోందండ రామాలయంలో శ్రీరామనవమి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్ద ఎత్తున దంపతులు కళ్యాణోత్సవంలో పాల్గొని స్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శాశ్వత ధర్మకర్త ఆకుల వెంకటేశ్వరరావు దంపతులు పాల్గొని స్వామివారికి కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు. దేవాలయం అర్చకస్వామి చిలకపాటి లక్ష్మణ్‌రామాచార్యులు కళ్యాణోత్సవ క్రతువును నిర్వహించారు. దేవాలయం అధ్యక్ష, కార్యదర్శులు అల్లం సాంబశివరావు, సింగంశెట్టి శివశంకర్, ఉపాధ్యక్షుడు అప్పికట్ల వెంకటేశ్వరరావు నేతృత్వంలో సభ్యులు భక్తులకు ఏర్పాట్లు చేశారు.

**నేతాజీనగర్‌లో.....**

నేతాజీనగర్‌లోని శ్రీ కోందరామాలయంలో శ్రీరామ నవమి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. పెద్ద ఎత్తున కళ్యాణోత్సవంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది. దేవాలయం కమిటి కార్యదర్శి పోతన శ్రీనివాసరావు నేతృత్వంలో సభ్యులు భక్తులకు ఏర్పాట్లు చేశారు. మూల విరాట్‌లను వివిధ రకాల పుష్పాలతో దేదీప్యమానంగా అలంకరించారు.

**శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవాలయంలో......**

పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవాలయం ప్రాంగణంలో కొలువై వున్న శ్రీ రామాలయంలో శ్రీరామనవమి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవాలయం ధర్మకర్తలు కళ్యాణోత్సవంలో పాల్గొని స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకస్వాములు శాస్త్రోక్తంగా కళ్యాణోత్సవాన్ని నిర్వమించారు. కమిటి సభ్యులు ఏర్పాట్లు చేశారు.

**గాంధీబొమ్మ సెంటర్‌లో.....**

పట్టణంలోని కసుకర్రు రోడ్డులో సీతారామకళ్యాణోత్సవ ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కసుకర్రు రోడ్డులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ప్రత్యేకంగా తయారు చేయించిన విగ్రహాలను వేంచేపుచేసి కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు. అధ్యక్ష, కార్యదర్శి కోట హేమసుందరగుప్తా, కొల్లిపర రమేష్‌బాబు నేతృత్వంలో సభ్యులు ఆలపాటి విజయ్‌కుమార్, ఆలపాటి సృజన్, తవ్వా రాధా, కనమర్లపూడి చక్రవర్తి తదితరులు ఏర్పాట్లు చేశారు.

**తాళ్ళపాలెంలో......**

మండల పరిధిలోని తాళ్ళపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కోదండ రామాలయంలో శ్రీ సీతారామకళ్యాణ మహోత్సవాన్ని అత్యంత కన్నుల పండువగా, ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయాన్ని వివిధ రకాల పుష్పాలతో, అరటి బోదెలతో, కొబ్బరి మట్టలతో అలంకరించారు. తాళ్ళపాలెం చుట్టుప్రక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. కమిటి సభ్యులు పాల్గొని ఏర్పాట్లు చేశారు.

# కన్నుల పండువగా శ్రీ సీతారాముల కళ్యాణం

**కొల్లివర,మార్చి 27 ప్రభాతవార్త:** శ్రీరామ నామంతో పల్లెలన్నీ పులకించిపోయాయి.మండలంలో ప్రతి గ్రామంలోని రామాలయాలలో



శ్రీరామనవమి ఉత్సవాలు కన్నులపండువగా నిర్వహించారు.కొన్ని గ్రామాలలో తెల్లవారు జామున రాముల వారిని ట్రాక్టరుపై ఏర్పాటు చేసి భజనలు చేసుకుంటూ కృష్ణానదికి తీసుకెళ్ళి పరిశుభ్రతతో విగ్రహాలను శుభ్రపరచి,భక్తులు కూడా స్నానాలుచేసి భజనలు చేసుకుంటూ రామాలయాలకు చేరుకున్నారు.పుణ్యదంపతులు పాల్గొని భక్తిశ్రద్దలతో సీతారాముల కళ్యాణం చేసారు.దీనిలో భాగంగా మండల కేంద్రం కొల్లిపర శ్రీదేవి భూదేవి సమేత శ్రీజనార్ధనస్వామి దేవాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఆలయ ప్రధాన అర్చకులు పరాశరం జగన్నాధాచార్యులు పర్యవేక్షణలో కొనసాగిన కార్యక్రమంలో సీతారాములస్వామి వారికి విశేషపూజలు జరిపి కళ్యాణోత్సవం జరిపించారు.రాత్రికి భక్తులు శ్రీరామనామంతో భజనలు చేసారు.ఆరిమండ వారి రామాలయంలో ఆరిమండ బసవకుటుంబరెడ్డి పుణ్యదంపతులు నిర్వహించిన కళ్యాణ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.కొల్లిపర గ్రామంలోని రామాలయాల్లో భక్తులు పోటీపడి మరీ సీతారాముల కళ్యాణమహోత్సవాన్ని నిర్వహించారు. శ్రీషిర్డిసాయిబాబా మందిరంలో అర్చకులు కొల్లిపర కుమారస్వామి,కొల్లిపర కుటుంబరావులు పుణ్య దంపతుల చేత పూజలు చేయించారు.మండలంలోని 20 గ్రామాలలో భక్తిశ్రద్దలతో శ్రీరామనవమి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. తీర్ధప్రసాదాలు, పానకం,వడపప్పు వంటివి భక్తులకు అందజేసారు. రామాలయాలు విద్యుత్ధీపాలతో సుందరంగా అలంకరించారు.పలు రామాలయాల్లో అన్నదానం నిర్వహించారు.ఆయా కార్యక్రమాలలో పోగుల రామలింగేశ్వశర్మ,చిలుకూరు వెంకటేశ్వశర్మ గ్రామ పెద్దలు,భక్తులు పాల్గొన్నారు.

# జువెనైల్ హోమ్‌ను సందర్శించిన ఏఎన్‌యు విద్యార్థులు

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, మార్చి27, ప్రభాతవార్త:** విజయవాడలోని జువెనైల్ హోమ్‌ను ఏఎన్‌యు విద్యార్థులు శుక్రవారం సందర్శించారు. ఏఎన్‌యులోని సోషియాలజీ అండ్ సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో రూసా 2.0 సహకారంతో నిర్వహిస్తున్న జాతీయ వర్క్‌షాపులో భాగంగా వర్క్‌షాపుకు హాజరైన విద్యార్థులను ఫీల్డ్ విజిట్‌లో భాగంగా విజయవాడలోని జువెనైల్ అబ్జర్వేషన్ హోమ్ సందర్శించారు. అక్కడి బాలలను కలుసుకుని సోషల్ డిఫెన్స్‌కు సంబందించిన అంశాలను వారితో చర్చించారు. అలాగే విద్య, ఉన్నతజీవితం, భవిష్యత్ గురించి కౌన్సెలింగ్ నిర్వహించారు. జువెనైల్ హోం సూపరింటెండెంట్ రామ్మోహన్ రెడ్డి హోంలో అందించే సదుపాయాలను, బాలల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకునే చర్యలు, అమలుచేస్తున్న పథకాలను వివరించారు. డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ దుర్గా ప్రసాద్ బాల నేరస్థులకు అందించే న్యాయపరమైన అంశాలను వివరించారు. వర్క్‌షాపు డైరెక్టర్ ఆచార్య ఎం.త్రిమూర్తిరావు వర్క్‌షాపు ఉద్దేశాన్ని వివరించారు. సోషల్ డిఫెన్స్ ద్వారా జువెనైల్ డెలిక్వెన్సీను



తగ్గించే సంస్కరణ చర్చలను తెలియజేశారు. అనంతరం ఆచార్య త్రిమూర్తిరావును సూపరింటెండెంట్ రామ్మోహన్ రెడ్డి సన్మానించారు. ఈ విజిట్‌లో విభాగం అధ్యాపకులు డాక్టర్ పి.రాజకుమార్, డాక్టర్ ఎస్.రాజశేఖర్, టూరిజం విభాగం అధ్యాపకులు రెహ్మాన్, పరిశోధకులు, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, సోషల్‌వర్క్ విద్యార్థులు పాల్గొన్నారు.

# నిజాయితీ,నిబద్ధత,అంకితభావంతో పని చేయాలి

## -ఏపి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్

**పొన్నూరు, మార్చి 27,ప్రభాతవార్త:** విద్యార్థులు ఎక్కడ పని చేసినా నిజాయితీ, నిబద్ధత, అంకితభావంతో పనిచేయాలని....వారి అభివృద్ధితో దేశాభివృద్ధి కూడా జరుగుతుందని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ అన్నారు. చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్ ్స యూనివర్సిటీలో చదువుతూ ఈ ఏడాది ప్రాంగణ ఎంపికల



ద్వారా ఆయా సంస్థల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులకు శుక్రవారం శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ఘన సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. యూనివర్సిటీలో ఈ ఏడాది మొత్తం 11వందల మందికిపైగా విద్యార్థులు ప్రాంగణ ఎంపికల ద్వారా వందకు పైగా కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారు. మొత్తం మీద 80శాతం మంది విద్యార్థులు ఆయా సంస్థల్లో కొలువులు కొల్లగొట్టారు. ముఖ్య అతిథి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ మనిషి ప్రవర్తనలో 70శాతం ప్రభావం చూపే నైతిక విలువలు, సంస్కృతి, వారసత్వం, ధార్మికత వంటి అంశాలు ఎక్కడా బోధించబడడం లేదు అనే ఆలోచన తనను ఎప్పుడూ ఆలోచనలో పడేస్తుందన్నారు. విద్యలో నైతిక విలువలు లేకపోతే అది యాంత్రికంగా మారి, సమాజానికి ఉపయోగపడదని తెలిపారు. పూర్వం మోరల్ సైన్స్ అనే విషయం ద్వారా కథల రూపంలో నీతిపాఠాలు బోధించేవారని, ప్రస్తుతం ఆ పద్ధతి విద్యావ్యవస్థలో తగ్గిపోయిందని విచారం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో విజ్ఞాన్ విశ్వవిద్యాలయం తల్లిదండ్రులను గౌరవించే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం అభినందనీయమన్నారు. తల్లిదండ్రుల త్యాగం అమూల్యమని, వారు చేసిన కృషి కోట్ల రూపాలయతో కూడా కొలవలేనిదని చెప్పారు తల్లిదండ్రులు త్యాగం చేయకపోతే విద్యార్థులు ఈ స్థాయికి చేరుకునే అవకాశం ఉండేది కాదన్నారు. విద్యాసంస్థలు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా నైతిక విలువలను కూడా బోధించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అధ్యాపకులు కూడా తమ జ్ఞానాన్ని సమకాలీనంగానవీకరించుకోవాలన్నారు.పరిశ్రమల్లో శిక్షణ పొందడం ద్వారా తాజా పరిజ్ఞానం విద్యార్థులకు అందించాలన్నారు.

**త్యాగాన్ని గుర్తించు ప్రయత్నం:**

గౌరవ అతిథిగా హాజరైన హైదరాబాద్ టీసీఎస్ ఇండస్ట్రీ సొల్యూషన్ యూనిట్ హెడ్ భీమశేఖర్ ఆత్మకూరు మాట్లాడుతూ తల్లిదండ్రులను సత్కరించడం వెనుక ఉన్న భావం ఎంతో లోతైనదన్నారు. వారి త్యాగాన్ని గుర్తించే ప్రయత్నమని పేర్కొన్నారు. శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రత్యేకతను సంతరించుకొందన్నారు. శ్రీరాముడు తన జీవితంలో ఎదురైన ప్రతి సవాలును అవకాశంగా మార్చుకొని విజయం సాధించినట్లే విద్యార్థులు కూడా సవాళ్ళను అవకాశాలుగా మార్చుకోవాలని సూచించారు. అంతర్జాతీయస్థాయిలో జరిగే కోడ్ విటా పోటీలో విజ్ఞాన్ విద్యార్థి విజయంసాధించడం విశ్వవిద్యాలయ ప్రతిష్టఉ పెంచిందన్నారు. విజ్ఞాన్ విశ్వవిద్యాలయం లోగోలో ఉన్న భావం ఎంతో లోతైనదన్నారు. అది జ్ఞానం, వివేకం, వికాసం, సేవ, విశిష్టత వంటి విలువలను ప్రతిబింబిస్తుందన్నారు.

**విజ్ఞాన్ మాత్రమే ఇలా:**

విజ్ఞాన్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ మన రాష్ట్రంలోనే ఒక్క విజ్ఞాన్ యూనివర్సిటీ మాత్రమే ఇలా తల్లిదండ్రులకు సన్మాన కార్యక్రమాన్ని శ్రీరామనవమి పర్వదినాన ఆనవాయితీ నిర్వహిస్తోందన్నారు. విజ్ఞాన్ యూనివర్సిటీకి చెందిన 11వందల మందికి పైగా ఇంత క్లిష్ట సమయంలో కూడా చాలా పెద్ద సంఖ్యలో మంచి ఉద్యోగాలు సాధించగలిగారన్నారు. విద్యార్థుల వ్యక్తిత్వాని ్న మార్చడం వర్సిటీలో చేరిన మొదటి నాలుగు నెలల్లోనే విద్యార్థులను ఇంటర్ విద్యావ్యవస్థ నుంచి పూర్తిగా బయటకు వచ్చేలాచేయగలగడం, విజ్ఞాన్‌లో చేరే పిల్లల్లో ఎక్కువ మంది గ్రామీణ ప్రాంతాల నుంచే వస్తున్నారనే ఉద్దేశంతో కేంబ్రిడ్జి యూనివర్సిటీ సహకారంతో ఆంగ్ల భాష నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించి అమలు చేయడం, నాయకత్వ స్ఫూర్తి, సృజనాత్మకత, నైపుణ్యాలు పెంపొందించడం కోసం ప్రత్యేక శిక్షణ కొనసాగించడం, విద్యార్థులతో అధ్యాపక బృందం నిరంతరం మద్దతుగా నిలబడడం వంటి అంశాల వల్ల విద్యార్థులు విజయం సాధించగలిగారన్నారు.

# స్వామివారికి దర్శించుకున్న అంబటి మురళీకృష్ణ

**చేబ్రోలు(పొన్నూరు), మార్చి 27,ప్రభాతవార్త:** చేబ్రోలు మండల పరిధిలోని కొత్తరెడ్డిపాలెంలో జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పాల్గొని స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ రామన్న రాజ్యం రావాలంటే...జగనన్న ప్రభుత్వం రావాలని అన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా జగన్మోహన



రెడ్డి ముఖ్యమంత్రి కావాలని, రామన్న రాజ్యాన్ని తీసుకురావాలని ప్రత్యేక పూజలు చేసినట్లు చెప్పారు. అంబటి వెంట నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# వైభవంగా గడ్డి కృష్ణారెడ్డి రోజారాణి దంపతుల ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు

**ఎ కొండూరు, మార్చి 27, ప్రభాతవార్త :** ఎ కొండూరు మండలం రామచంద్రాపురం గ్రామంలో శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని భక్తులు అత్యంత భక్తి శ్రద్దలతో ఆనందోత్సాహాలతో గడ్డి కృష్ణారెడ్డి రోజారాని దంపతుల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరిపారు. గ్రామంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో వైభవంగా జరిగిన ఈ కళ్యాణ మహోత్సవ వేడుకల్లో గ్రామ పురప్రముఖులు టిడిపి సీనియర్ లీడర్ మండల మాజీ అధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి, రోజారాణి దంపతులతో పాటు ఒగ్గు కృష్ణారెడ్డి, కుప్పాల వెంకటేశ్వరరావు, పంబా వెంకటేశ్వరరావు, పెరుమాళ్ల గోపాలరావు, గాదె రవీందర్ రెడ్డి దంపతులు పీటల మీద కూర్చొని స్వామివారికి భక్తిశ్రద్దలతో పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. అనంతరం వేద మంత్రోచ్చారణల మధ్య కళ్యాణ మహోత్సవంలో ఈ దంపతులు పాల్గొన్నారు. ఈ కళ్యాణ మహోత్సవంలో భక్తులు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ వారు భక్తులకు పానకం వడపప్పు ప్రసాద వితరణ గావించారు. ఆ సీతారాముల ఆశీస్సులు అందరిపై ఉండాలని గడ్డి కృష్ణారెడ్డి రోజారాణి ఇంకా కళ్యాణోత్సవంలో పాల్గొన్న ఇతర దంపతులు కోరారు.

# పన్ను వసూళ్ళ వేగవంతం చేయాలి

**-ప్రతి ఒక్కరూ లక్ష్యాలను చేరుకోవాల్సిందే! -అలసత్వం వహిస్తే సహించేది లేదు -మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు**



పొన్నూరు, మార్చి 27,ప్రభాతవార్త: పురపాలక సంఘ పరిధిలో పన్ను వసూళ్ళను వేగవంతం చేయాలని, ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు నిర్దేశించుకున్న లక్ష్యాలను ప్రతి ఉద్యోగి చేరుకోవాల్సిందేనని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు ఆదేశించారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో పన్ను వసూళ్ళ బృందాలతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పన్ను వసూళ్ళకు సంబంధించి పన్ను బకాయిదారుల్లో చైతన్యం తేవాలన్నారు. ప్రభుత్వం ఈ నెలాఖరులోపే చెల్లిస్తే 50శాతం వడ్డీ మాఫీ చేస్తున్న విషయాన్ని ప్రచారం చేయాలన్నారు. పన్ను వసూళ్ళ బృందాల సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో మునిసిపల్ రెవెన్యూ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

# తెదేపాకు మండవ గౌతమ్ రాజీనామా!!

**పొన్నూరు, మార్చి 27,ప్రభాతవార్త:** మండల పరిధిలోని దొప్పలపూడి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు మండవ గౌతమ్ టిడిపికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను జిల్లా పార్టీ అధ్యక్షుడు పల్లి మాణిక్యరావుకు పంపారు. ఈ సందర్భంగా గౌతమ్ లేఖలో టిడిపిలో ఆర్థికంగా, మానసికంగా, శారీరకంగా దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు. పార్టీలో విలువ లేనప్పుడు పార్టీలో కొనసాగడం కష్టంగా ఉందని భావించి రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. తాను నిర్వహిస్తున్న పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ యూనిట్-38కిసంబంధించిన కన్వీనర్



పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. రాజీనామాను ఆమోదించాలని లేఖలో పేర్కొన్నారు.పార్టీలో సీనియర్‌ని అయినప్పటికీ విలువ లేకుండా పోయిందన్నారు. విలువలులేని చోట ఉండకూడదనే భావనతో రాజీనామా నిర్ణయాన్ని తీసుకున్నట్లు లేఖలో పేర్కొన్నారు.

# ధర్మప్రధాత శ్రీరామచంద్రమూర్తి

**పెనమలూరు/ఉయ్యూరు మార్చి27,ప్రభాతవార్త :** ధర్మాన్ని నాలుగుపాదాలమీద నడిపించిన ధర్మమూర్తి శ్రీరామచంద్రప్రభు అని తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.వి.బి.రాజేంద్రప్రసాద్ అన్నారు.శ్రీరామనవమి పర్వదిన పండుగ సందర్భంగా ఉయ్యూరు కాపుల రామామలయం,కాటూరు శ్రీరామమందిరం వద్ద ఆలయకమిటీ ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి సీతారామ కళ్యాణ మహోత్సవ ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండ్రి మాట జవదాటని కుమారుడిగా,ధర్మాన్ని నాలుగు పాదాలపై నడిపిన ధర్మమూర్తిగా అందరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కులమతాలకు అతీతంగా అన్నదమ్ములవలె కలసి మెలసి ఉండాలని సూచించారు.ఈ సందర్భంగా ఆలయకమిటీ,కాటూరు గ్రామ తెలుగుదేశంపార్టీ,ఉయ్యూరు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

# ఘనంగా సుధాస్వామి ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు

**విజయవాడ కార్పొరేషన్,మార్చి 27,ప్రభాతవార్త :** లెనిన్ సెంటర్ లోని ఓం శ్రీ షిర్డి నాగసాయిబాబా నాగమానసాదేవి మందిరంలో శుక్రవారం శ్రీరాముడు జన్మించిన అభిజిత్ లగ్నంలో నవమి వేడుకలను మందిర వ్యవస్థాపకులు సుధాస్వామి ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై భక్తి శ్రద్దలతో సీతారాముల కళ్యాణాన్ని వీక్షించారు. అనంతరం సుధాస్వామి అధ్వర్యంలో భక్తులకు పానకం,వడపప్పును సమర్పించి, వాటిని భక్తులకు పంపిణీ చేశారు. అనంతరం పల్లకీని ఊరేగింపు గావించారు. అనంతరం ఘనంగా అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అసంఖ్యాకంగా భక్తులు పాల్గొన్నారు.

# 65లక్షలతో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

**కంకిపాడు మార్చి27,ప్రభాతవార్త :** పెనమలూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందు ఉంచేందుకు కృషి చేస్తున్నామని పెనమలూరు నియోజకవర్గ శాశనసభ్యులు బోడేప్రసాద్ తెలిపారు.కంకిపాడు మండలం ఈడుపుగల్లు పరిధిలో ఆంజనేయ టౌన్‌షిప్ నుంచి ధనేకుల కాలేజి రోడ్డువరకు సిఆర్‌డిఏ నిధులు 65లక్షలతో నిర్మించే డ్రైనేజీ పనులకు శాశనసభ్యులు శంకుస్థాపన చేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణాజిల్లాలో పెనమలూరు నియోజకవర్గంను అభివృద్ధి చేయటంలో నిర్విరామంగాకృషి చేస్తున్నామని నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వేగవంతంగా నిర్మాణాలు పూర్తిచేసేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

# పానకం వడపప్పు పంపిణీ

**పొన్నూరు, మార్చి 27,ప్రభాతవార్త:** శ్రీరామ నవమి ఉత్సవాన్ని పురస్కరించుకొని కొన్ని గృహాలవారు, వ్యాపార సంస్థలవారు, ఫోటో స్టూడియోల వారు ఆయా షాపుల వద్ద పానకం, వడపప్పులను పంపిణీ చేశారు. వివిధ గ్రామాల నుంచి వివిధ పనులపై వస్తున్న పలువురికి వీటిని పంపిణీ చేశారు.



అందులో భాగంగా ఐలాండ్ సెంటర్‌లో స్టూడియో నిర్వాహకుడు మునిపల్లె మురళీ పానకం, వడపప్పు పాదచారులకు పంపిణీ చేశారు.

# భక్తిశ్రద్ధలతో కళ్యాణోత్సవం

**పొన్నూరు, మార్చి 27,ప్రభాతవార్త:** తెనాలి పట్టాభిరామస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో కళ్యాణోత్సవాన్ని అర్చకస్వాములు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్య నిర్వహణాధికారి ఎన్‌వీఎన్ మల్లేశ్వరి పాల్గొని పర్యవేక్షించారు. అర్చకస్వామి నాగమారుతి పూజాధి కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది.ఈ కార్యక్రమంలో భక్త



బృందం సభ్యులు ముప్పవరపు దుర్గాప్రసాద్, నారాయణ, సాంబయ్య, దేవరకొండ శంకరరావు, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జలగం రాఘవ, వరప్రసాద్, వెంకటేశ్వరరావు, డి.హనుమంతరావు, పసులేటి దశరథరామయ్య, మాధవరెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

